


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 20, పేజీలు - 08

బుధవారం, జులై 15, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక HYDERABAD




## భారత్‌లో గూగుల్ భారీ ఏఐ ప్రణాళికలు

**- విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అమెరికా టెక్నాలజీ దిగ్గజం గూగుల్, భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో తన కార్యకలాపాలను భారీగా విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. భారత డెవలపర్లు, స్టార్టప్‌లు, విద్యాసంస్థలను లక్ష్యంగా

2లో..

## ఏఐ ఉపయోగించండి.. సైబర్ భద్రత పటిష్ఠం చేయండి

**- బ్యాంకులకు ఆర్బీఐ కీలక సూచన**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) బ్యాంకింగ్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగాన్ని పెంచాలని, సైబర్ భద్రతను పటిష్ఠం చేసుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా బ్యాంకులకు పిలుపునిచ్చారు. వినియోగదారులకే

2లో..

## హార్మూజ్ జలసంధిపై ట్రంప్ యూటర్న్

**- 20 శాతం టోల్ ప్రతిపాదన వెనక్కి!**



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హార్మూజ్ జలసంధి మీదుగా రవాణా అయ్యే సరుకులపై 20 శాతం సుంకం (టోల్) విధించాలన్న తన ప్రతిపాదనను ఆయన విరమించుకున్నారు.

2లో..

## ముద్రగడ పద్మనాభ రెడ్డి కన్నుమూత!

**- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సీనియర్ నేత, కాపు ఉద్యమ సారథి ముద్రగడ పద్మనాభం (73) మంగళవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఆయన కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణవార్తతో ఏపీ రాజకీయ వర్గాల్లో, ఆయన అనుచరుల్లో తీవ్ర విషాదం నెలకొంది. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో 1953, జనవరి 22న జన్మించిన ముద్రగడ పద్మనాభం, కాపు సామాజిక వర్గ రిజర్వేషన్ల కోసం సాగించిన ఉద్యమాలతో రాష్ట్రవ్యాప్తంగా బలమైన నేతగా గుర్తింపు పొందారు. తన రాజకీయ జీవితంలో అనేక పార్టీలలో పనిచేసిన ఆయన, ఇటీవలి కాలంలో వైసీపీలో చేరి, ఆ పార్టీలోనే కొనసాగారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ముద్రగడ, 1977లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1978లో జనతా పార్టీ తరపున తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

2లో..

# పాతబస్తీలో ఓట్ల గల్లంతు గండం

### ఎస్ఐఆర్ తో సగం ఓటర్లు తగ్గిపోతారా.?




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాగుతున్న ఓటర్ల స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్ ప్రక్రియ హైదరాబాద్ పాతబస్తీ లో తీవ్ర రాజకీయ కాక రేపుతోంది. మునుపెన్నడూ లేని విధంగా ఓటర్ల జాబితా ప్రక్షాళనలో భాగంగా పౌరసత్వం, స్థానికతను నిరూపించుకోవడానికి అధికారులు కఠినమైన ధృవీకరణ పత్రాలను అడుగుతుండటంతో పాతబస్తీలోని లక్షలాది మంది సామాన్య ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి వద్ద తగిన పాత నివాస ఆధారాలు, లీగల్ డాక్యుమెంట్లు లేకపోవడంతో పెద్ద ఎత్తున ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఏర్పడింది. ఈ పరిణామం ఎంఐఎం అగ్రనేత అసదుద్దీన్ ఓవైసీని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. తన సొంత రాజకీయ కోటను కాపాడుకునేందుకు రంగంలోకి దిగిన ఓవైసీ, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే వ్యూహానికి తెరలేపారు.

**సీఎస్ వద్దకు ఎంఐఎం రాయబారం!**

పాతబస్తీ ఓటర్ల సమస్యపై నేరుగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో చర్చించేందుకు ఎంఐఎం నాయకత్వం ప్రయత్నించినప్పటికీ, సీఎం అపాయింట్‌మెంట్ దొరకడం లేదంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుండటంతో, ఎంఐఎం ప్రతినిధి బృందం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి తమ డిమాండ్లను విన్నవించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 162 ని ఉపయోగించి, తెలంగాణలోని ఓటర్లకు శాశ్వత నివాస ధృవీకరణ పత్రాలు లేదా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ జారీ చేయాలని డిమాండ్ చేసింది. కర్ణాటక ప్రభుత్వం సకల సేవల చట్టం-2011 కింద జీవో నంబర్ డీపీఏఆర్ 191 ఎస్ ఏకెఏఎల్ఏ 2011 ద్వారా ఇలాంటి నివాస పత్రాలను జారీ చేస్తోందని, అదే పంథాను ఇక్కడా అమలు చేసి

2లో..

## భోజ్ శాలలో శుక్రవారం నమాజ్‌కు అనుమతి

**- సుప్రీంకోర్టు సంచలన తీర్పు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** మధ్యప్రదేశ్ లోని ధార్ జిల్లాలో ఉన్న వివాదాస్పద భోజ్ శాల-కమల్ మౌలా మసీదు ప్రాంగణంపై జరుగుతున్న విచారణ నేపథ్యంలో సుప్రీంకోర్టు మంగళవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. భోజ్ శాలా ప్రాంగణంలో ఉన్న కమలా మౌలా మసీదులో ముస్లింలు శుక్రవారం నమాజ్ చదువుకునేందుకు అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. ఈ మేరకు అనుమతి ఇస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే గతంలో మధ్యప్రదేశ్ హైకోర్టు ఈ ప్రాంగణాన్ని ఆలయంగా గుర్తిస్తూ ఇచ్చిన తీర్పు నిలిపివేతకు మాత్రం నిరాకరించింది. మధ్యప్రదేశ్ లోని భోజ్‌శాల-కమల్ మౌలా మసీదు సముదాయాన్ని ఆలయంగా ప్రకటిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చేందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు వివాదాస్పద స్థలం సమీపంలో శుక్రవారం ప్రార్థనలు చేసుకునేందుకు ముస్లింలకు మాత్రం అనుమతినిచ్చింది. సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని

2లో..

## జెట్ స్పీడ్‌తో ఆర్ఆర్ఆర్ పనులు

**- నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్ భేటీ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో బిజీబిజీగా పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు.

2లో..

## సమస్య రాకముందే పసిగట్టాలి.. అదే సమర్థత



- మంత్రులు, కార్యదర్శులతో సీఎం చంద్రబాబు సమావేశం
- అసలు సమస్యే రాకుండా చూసేవాడు అద్భుతమైన అధికారి
- అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లాలి.. నాలుగు గోడలకే పరిమితం కావొద్దని సూచన
- ఇకపై నెలవారీ ఆర్థిక నివేదికల ఆధారంగా సమీక్ష ఉంటుందని స్పష్టీకరణ

అమరావతి (ప్రశ్న న్యూస్) “సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించేవాడు మంచి అధికారి అయితే, అసలు సమస్యే తలెత్తకుండా ముందుచూపుతో పనిచేసేవాడు అద్భుతమైన అధికారి. ఆ కోణంలో అధికారులు పనిచేయాలి” అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి వాస్తవాలు తెలియాలంటే అధికారులు నాలుగు గోడలు దాటి ప్రజల్లోకి వెళ్లాల్సిందేనని, వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లగలమని హితవు పలికారు. మంగళవారం సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు, విభాగాధిపతులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం మాట్లాడారు.

2లో..

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారు

- మత్స్యకార మృతుల కుటుంబాలను పరామర్శించిన జగన్
- మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ
- ఆ రాత్రి బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదని ఆగ్రహం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఇటీవల విశాఖపట్నం సముద్ర తీరంలో జరిగిన విషాదకర బోటు ప్రమాదంలో గల్లంతైన, ప్రాణాలు కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించేందుకు జగన్ విశాఖ వెళ్లారు. నగరంలోని జబ్బర్‌తోటకు వెళ్లిన ఆయన బాధిత కుటుంబాను కలిసి ఓదార్చారు. మూడేళ్ల కళ్లు మూసుకుంటే మన ప్రభుత్వం వస్తుందని అప్పుడు తలా కోటి రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చారు. విశాఖ తీరానికి కేవలం 10 మైళ్ల దూరంలోనే రాకాసి అలల తాకిడికి వారి బోటు మునిగిపోయింది. ప్రమాదానికి ముందే తాము క్షేమంగా వస్తున్నామని మత్స్యకారుడు చిన్నా తన కుటుంబ సభ్యులకు ఫోన్ కూడా చేశాడు. అయితే బోటు మునిగిపోయిన వెంటనే ఒకరు బోటు కింద పడి మరణించగా, మిగిలిన ఆరుగురు ప్రాణాలు కాపాడుకోవడానికి ఈత కొడుతూ సముద్రంలో పోరాటం చేశారు. వేటకు వెళ్లిన వారు తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు కోస్ట్ గార్డ్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు కనీసం స్పందించలేదు. ఒకవేళ అధికారులు సకాలంలో స్పందించి, కోస్ట్ గార్డ్ రంగంలోకి

2లో..

## పెరుగుతున్న ఈఎంఐలు..

**సొంత ఇంటి కలను వాయిదా వేస్తున్న యువత**

- సొంత ఇంటి కంటే అద్దెలో ఉండేందుకే యువత ఆసక్తి
- ఆర్థిక స్వేచ్ఛ, పెట్టుబడులకే తొలి ప్రాధాన్యత
- అధిక ఈఎంఐలు, ఆస్తి ధరలే ఈ మార్పునకు కారణం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారతదేశం యువత ఆలోచనా ధోరణిలో ప్రస్తుతం స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. సొంత ఇంటి కలను సాకారం చేసుకోవడం కంటే ఆర్థిక స్వాతంత్ర్యం సాధించడానికే మిలీనియల్స్, జెన్-జెడ్ ఉద్యోగులు అధిక

2లో..

## అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు

- వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని వినతి
- 2028 జూన్ 2 నాటికి వరంగల్ విమానాశ్రయం సిద్ధం చేయాలని కోరిన సీఎం
- కాకతీయ సంస్కృతి ఉట్టిపడేలా వరంగల్ ఎయిర్‌పోర్ట్ డిజైన్ ఉండాలని సూచన

2లో..



## కడియం వర్సెస్ కొండా.. రచ్చకెక్కిన రాజకీయం

**- మీనాక్షి నటరాజన్‌కు మంత్రి ఫిర్యాదు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కాంగ్రెస్‌లో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, పరకాల ఎమ్మెల్యే కొండా సురేఖ మధ్య కొనసాగుతున్న విభేదాలు ఇప్పుడు పార్టీ హైకమాండ్ వరకు చేరాయి. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌ను

2లో..



## సింగరేణికి పట్టిన శని ఆ రెండు పార్టీలే

- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు సింగరేణిని దోచుకుతిన్నాయన్న కిషన్ రెడ్డి
- సింగరేణిని అప్పుల ఊబిలోకి నెట్టేశారని ఆరోపణ
- సింగరేణిని కాపాడుకోవడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణకు గుండెచప్పుడు లాంటి సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు కలిసి నిలువునా ముంచేశాయని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. కేసీఆర్ కుటుంబం, కాంగ్రెస్ పాలకులు పోటీపడి మరీ సింగరేణిని తమ సొంత ఖజానాలా వాడుకున్నారని మండిపడ్డారు. కార్మికుల చెమట వాసన తెలిసిన సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టి,



2లో..

ప్రజాప్రశ్న



# భారత్‌లో గూగుల్ భారీ ఏఐ ప్రణాళికలు

చేసుకుని పలు కీలక కార్యక్రమాలను మంగళవారం ఆవిష్కరించింది. బెంగళూరులో జరిగిన 'గూగుల్ ఐ/ఓ కనెక్ట్ ఇండియా 2026' సదస్సులో ఈ ప్రకటనలు చేసింది. విద్య, ఆరోగ్యం, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో కొత్త ఏఐ ప్రోగ్రామ్‌లను ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమానికి హాజరైన కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ భారత్‌లో ఇంటర్నెట్ సేవలను విస్తరించడంలో గూగుల్ కీలక పాత్ర పోషించిందని ప్రశంసించారు. సెర్చ్, ఆండ్రాయిడ్, యూట్యూబ్, గూగుల్ పే వంటి ఉత్పత్తులతో కోట్ల మంది జీవితాల్లో మార్పు తెచ్చిందని అన్నారు. వ్యాపారాలు, ప్రభుత్వ సేవలు, విద్యా విధానంలో గూగుల్ అసాధారణమైన ఆవిష్కరణలు చేసిందని కొనియాడారు. ఈ సదస్సులో భాగంగా గూగుల్ పలు ముఖ్యమైన ప్రకటనలు చేసింది. గూగుల్ డీప్‌మైండ్, 'ఏఐ రీసెర్చ్ ఫౌండేషన్స్' పేరుతో 56 గంటల ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది. నాస్కామ్, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) భాగస్వామ్యంతో ఈ ప్రోగ్రామ్‌ను అందివ్వనుంది. దీని ద్వారా భారీ లాంగ్వేజ్ మోడళ్లను రూపొందించడంలో నిపుణులకు శిక్షణ ఇస్తారు. అలాగే, అటల్ ఇన్నోవేషన్ మిషన్ కింద ఉపాధ్యాయుల కోసం 'ఏటీఎల్ సారథి' అనే జెమిని ఆధారిత అసిస్టెంట్‌ను ప్రవేశపెట్టింది. ప్రాథమికంగా 100 పాఠశాలల్లో దీన్ని అమలు చేయనున్నారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో ఢిల్లీ ఎయిమ్స్ పరిశోధకులతో కలిసి పనిచేస్తున్నట్లు గూగుల్ తెలిపింది. తమ 'మెడ్‌జెమ్మా' ఓపెన్ ఏఐ మోడళ్లను ఉపయోగించి కుష్టు వ్యాధి, లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యం వంటి అంశాలపై భారత్‌కు ప్రత్యేకమైన టూల్స్ అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొంది. వీటిని దేశంలోని దేవలపర్లందరికీ అందుబాటులో ఉంచుతామని వివరించింది. దీంతో పాటు, గూగుల్ 'జెమిని లైవ్' ఇప్పుడు సంస్కృతం, భోజ్‌పురి, మైథిలి సహా 25 భారతీయ భాషలు, మాండలికాలకు సపోర్ట్ చేస్తుందని వెల్లడించింది. ఇతర దేశాలతో పోలిస్తే భారత దేవలపర్లు ఏఐని అత్యంత వేగంగా వినియోగిస్తున్నారని గూగుల్ ఇండియా కంట్రీ మేనేజర్ ప్రీతి లోబానా తెలిపారు. వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రమాణాలను అందించడంపై దృష్టి సారించామని వివరించారు. 2025లో గూగుల్ ప్లే స్టోర్, ఆండ్రాయిడ్ ఎకోసిస్టమ్ ద్వారా భారత ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ. 5.3 లక్షల కోట్ల ఆదాయం సమకూరిందని, ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 28 శాతం అధికమని గూగుల్ పేర్కొంది.

# ఏఐ ఉపయోగించండి.. సైబర్ భద్రత పటిష్ఠం చేయండి

పెద్దపీట వేయాలని అన్నారు. మంగళవారం ముంబైలో ప్రభుత్వ రంగ మరియు ఎంపిక చేసిన ప్రైవేట్ రంగ బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లతో ఆర్బీఐ నిర్వహించిన అర్ధవార్షిక సమావేశంలో ఆయన ఈ కీలక సూచనలు చేశారు. ఈ సమావేశానికి ఆర్బీఐ గవర్నర్‌తో పాటు డిప్యూటీ గవర్నర్లు స్వామినాథన్ జె., డా. పూనమ్ గుప్తా, ఎస్. సి. ముర్ము, రోహిత్ జైన్‌లతో పాటు పలువురు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, భారత బ్యాంకింగ్ రంగం అన్ని విభాగాల్లోనూ విస్తృతమైన వృద్ధిని సాధించిందని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో, ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలకు వివేకంతో కూడిన మద్దతును కొనసాగించాలని ఆయన బ్యాంకులను కోరారు. బ్యాంకింగ్‌లో టెక్నాలజీ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో, ఏఐ వంటి అధునాతన సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని గవర్నర్ సూచించారు. దీని ద్వారా సేవలను విస్తరించవచ్చని, నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని, ఖర్చులను తగ్గించుకోవచ్చని ఆయన వివరించారు. అదే సమయంలో, సైబర్ దాడుల నుంచి రక్షణకు బలమైన వ్యవస్థలు, పటిష్ఠమైన అంతర్గత నియంత్రణలు తప్పనిసరి అని నొక్కి చెప్పారు. కస్టమర్ల డేటా దుర్వినియోగం కాకుండా, మోసాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సెంట్రల్ కేవైసీ రికార్డ్స్ రిజిస్ట్రీ (సీకేవైసీఆర్), నకిలీ కరెన్సీ నోట్ల గుర్తింపు, మ్యూల్ హంటర్ కార్యక్రమం, సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ), యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (యూఎల్ఐ), అకౌంట్ అగ్రిగేటర్ ఫ్రేమ్‌వర్క్ వంటి పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమాలపై బ్యాంకుల ప్రతినిధులు తమ అభిప్రాయాలను, ఫీడ్‌బ్యాక్‌ను ఆర్బీఐకి అందించారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని వారు పునరుద్ఘాటించారు.

# హర్మూజ్ జలసంధిపై ట్రంప్ యూటర్న్

గల్ఫ్ దేశాలతో భారీస్థాయిలో వాణిజ్య, పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రతిపాదించిన కేవలం 24 గంటల వ్యవధిలోనే ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకోవడం గమనార్హం. మంగళవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వివరాలను వెల్లడించారు. "మధ్యప్రాచ్య దేశాల నేతలతో జరిపిన ఫలవంతమైన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందాలను భారీ డీల్స్‌గా అభివర్ణించిన ఆయన, ఇవి ఇరుపక్షాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా అమెరికాలో మరిన్ని కర్మాగారాలు, తయారీ ప్లాంట్లు ఏర్పాటవుతాయని, తద్వారా అధిక వేతనాలతో కూడిన లక్షలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నిజానికి సోమవారం నాడే ట్రంప్ ఈ సుంకం విధింపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. హర్మూజ్ జలసంధికి అమెరికా సంరక్షకుడిగా వ్యవహరిస్తుందని, ఈ కీలక మార్గంలో భద్రత కల్పించేందుకు అయ్యే వ్యయాన్ని తిరిగి రాబట్టేందుకే ఈ సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతల నెలకొన్న నేపథ్యంలో, ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన ఈ జలసంధి భద్రత కోసం ఇటువంటి చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ సుంకం ప్రతిపాదనపై గల్ఫ్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. దీనివల్ల అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన విపణిపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆయా దేశాలు భావించాయి. మరోవైపు, ఈ జలసంధిపై అమెరికా ఆధిపత్యాన్ని సహించేది లేదని ఇరాన్ హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తన నిర్ణయాన్ని సమీక్షించుకుని, సుంకం విధింపు కంటే ఆర్థిక దౌత్యానికే మొగ్గు చూపారు.

# ముద్రగడ పద్మనాభ రెడ్డి కన్నుమూత!

ఆ సమయంలో ప్రత్తిపాడు నుంచి గెలిచారు. అనంతరం 1982లో తెలుగుదేశం పార్టీలో చేరి 1983, 1985, 1989 ఎన్నికల్లో వరుసగా గెలుపొందారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత టీడీపీతో విభేదించి ప్రజా రక్షణ సమితి, తెలుగునాడు పేర్లతో సొంత పార్టీలు స్థాపించారు. 1999లో కాకినాడ నుంచి ఎంపీగా కూడా విజయం సాధించారు. రాజకీయ నాయకుడిగా కంటే కాపు ఉద్యమ నేతగా ముద్రగడ పద్మనాభం రాష్ట్రవ్యాప్తంగా సుపరిచితులు. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఆయన అనేక పోరాటాలు, దీక్షలు చేపట్టారు. ముఖ్యంగా, 2016లో తునిలో ఆయన ఆధ్వర్యంలో జరిగిన 'కాపు ఐక్య గర్జన' సభ, తదనంతర పరిణామాలు అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించాయి. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన రాజకీయ వైఖరి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను ఓడిస్తానని సవాల్ విసిరారు. ఆ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ఘన విజయం సాధించడంతో, తాను ఇచ్చిన మాటకు కట్టుబడి ముద్రగడ తన పేరును 'ముద్రగడ పద్మనాభరెడ్డి'గా గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అధికారికంగా మార్చుకున్నారు. గత ఏడాది కాలంగా వయసు రీత్యా పలు ఆరోగ్య సమస్యలతో ఆయన తరచూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ముద్రగడకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపట్ల  పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు.

## కడియం వర్సెస్ కొండా..

# రచ్చకెక్కిన రాజకీయం

హైదరాబాద్‌లో కలిసిన మంత్రి కొండా సురేఖ, కడియం శ్రీహరి వ్యవహారశైలిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నాలుగు పేజీల లేఖను మీనాక్షి నటరాజన్‌కు కొండా సురేఖ అందించారు. తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని కావాలనే తనను వివాదాల్లోకి లాగుతున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ భేటీ సందర్భంగా కడియం శ్రీహరి తనకు సమాచారం ఇవ్వకుండా దేవాదాయ శాఖకు సంబంధించిన సమీక్షలు నిర్వహిస్తున్నారని ఇది పరిపాలనా వ్యవస్థకు విరుద్ధమని మంత్రి కొండా సురేఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. తన శాఖకు సంబంధించిన అంశాల్లో కడియం శ్రీహరి జోక్యం చేసుకోవడం వల్ల తన అధికార పరిధి దెబ్బతింటోందని తన పని తాను చేసుకుంటున్నా అనవసరంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేసినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రి సురేఖ వివరాలను ఓపికగా విన్న మీనాక్షి నటరాజన్ చిన్న చిన్న విషయాలను పెద్దగా పట్టించుకోవద్దని నాయకులు అంతా సంయమనం పాటించాలని సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంపైనే దృష్టి పెట్టాలని వ్యక్తిగత విభేదాల కంటే ప్రజా సమస్యలపై ఎక్కువగా పని చేయాలని మీనాక్షి నటరాజన్ సూచించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడంపై దృష్టి సారించాలని కూడా హితవు పలికినట్లు సమాచారం. కడియం శ్రీహరిపై అసంతృప్తిని మంత్రి కొండా సురేఖ ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. తాజాగా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కూడా కలిసి అధికారికంగా ఫిర్యాదు చేయడంతో ఈ వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఇద్దరు నేతల మధ్య నెలకొన్న విభేదాలకు పార్టీ అధిష్టానం ఎలా పరిష్కారం చూపుతుందన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# పాతబస్తీలో ఓట్ల గల్లంతు గండం

పాతబస్తీ పేదలను ఆదుకోవాలని ఓవైసీ కోరుతున్నారు.

### తక్కువ ఓటింగ్.. అసలు కారణం ఓటర్ల జాబితా లోపాలే!

ఎన్నికల సంఘం  అధికారిక డేటాను పరిశీలిస్తే, హైదరాబాద్ జిల్లా పరిధిలో, ముఖ్యంగా పాతబస్తీ నియోజకవర్గాలైన చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా వంటి ప్రాంతాలలో ప్రతి ఎన్నికల్లోనూ అత్యంత తక్కువ ఓటింగ్ శాతం నమోదవుతుంది. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా సగటు ఓటింగ్ 45% నుండి 50% లోపే ఉంటుంది. పోలింగ్ రోజున ప్రజలు క్యూ లైన్లలో పెద్ద ఎత్తున నిలబడినట్లు కనిపించినప్పటికీ, తుది ఫలితాల్లో ఓటింగ్ శాతం సగం కూడా దాటకపోవడానికి ప్రధాన కారణం ఓటర్ల జాబితాలోని అడ్డగోలు లోపాలే. ఒకే ఇంట్లో పదుల సంఖ్యలో ఓట్లు ఉండటం, చనిపోయిన వారి ఓట్లు, వలస వెళ్లిన వారి ఓట్లు అలాగే ఉండటంతో పోలింగ్ శాతం గణనీయంగా పడిపోతోంది.

### సగానికి పైగా ఓట్లు మాయమయ్యే ముప్పు!

గతంలో బూత్ లెవెల్ అధికారులు  కేవలం ఆధార్ కార్డ్ లేదా ఏదైనా ఒక సాధారణ గుర్తింపు పత్రాన్ని చూసి ఓటు నమోదు చేసేవారు. కానీ ఈసారి జరుగుతున్న  స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్ లో నిబంధనలను కఠినతరం చేశారు. కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలన్నా, ఉన్న ఓటును నిలబెట్టుకోవాలన్నా దశాబ్దాల నాటి మున్సిపల్ అసెస్‌మెంట్ రసీదులు, రిజిస్టర్డ్ సేల్ డీడ్స్ లేదా పాత పౌరసత్వ ఆధారాలను చూపించాల్సి వస్తోంది. పాతబస్తీలో నివసించే మెజారిటీ ముస్లిం పేద కుటుంబాలు అద్దె ఇళ్లలోనో, లేదా ఎలాంటి లీగల్ డాక్యుమెంట్లు లేని పాత ఇళ్లలోనో తరతరాలుగా నివసిస్తున్నారు. ప్రస్తుత తనిఖీల్లో ఈ పత్రాలు చూపించలేకపోతుండటంతో, ఈ సారి ప్రక్షాళన ప్రక్రియ పూర్తయ్యే సరికి పాతబస్తీలో సగానికి పైగా ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

### ఓవైసీ పొలిటికల్ భయం

ఈ ఓట్ల గల్లంతు భయం వెనుక ఎంఐఎం పార్టీ ఉనికికి సంబంధించిన పెద్ద రాజకీయ కోణం దాగి ఉంది. పాతబస్తీలో పోలింగ్ శాతం తక్కువగా ఉన్నప్పటికీ, అక్కడ నమోదైన బల్క్ ఓటింగ్ , లాయల్ ఓట్ బ్యాంక్ వల్లే ఎంఐఎం దశాబ్దాలుగా ఏకపక్ష విజయాలను సాధిస్తోంది. ఒకవేళ ఈ స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్  వల్ల లక్షలాది మంది ఓట్లు తొలగిస్తే, ఎంఐఎం కోట బలహీనపడుతుంది. అంతేకాకుండా, భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికలు, జీహెచ్‌ఎంసీ ఎన్నికలలో పార్టీ సీట్ల సంఖ్య దారుణంగా పడిపోయే ప్రమాదం ఉంది. అందుకే ఓవైసీ దీనిని తీవ్రమైన  సమస్య గా మలిచి, కర్ణాటక మోడల్ పీఆర్సీ కార్డును తెరపైకి తెచ్చి కాంగ్రెస్ ప్రభుత్వంపై బ్లాక్‌మెయిల్ రాజకీయం నడుపుతున్నారనే విమర్శలు కూడా వస్తున్నాయి.

### రేవంత్ సర్కార్ ఆచితూచి అడుగులు

ఈ పీఆర్సీ డిమాండ్‌పై సీఎం రేవంత్ రెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా మౌనం వహిస్తున్నారు. తెలంగాణలో స్థానికత అనేది సెంటిమెంట్‌తో కూడిన అంశం. హడావుడిగా ఎంఐఎం అడిగినట్లు శాశ్వత నివాస పత్రాలు  జారీ చేస్తే, అది రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దుమారానికి దారి తీస్తుంది, పైగా బీజేపీ దీనిని పెద్ద ఎత్తున అందిపుచ్చుకుంటుంది. చట్టపరంగా ఓటర్ల జాబితా సవరణ అనేది పూర్తిగా కేంద్ర ఎన్నికల సంఘం  పరిధిలోని అంశం కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం ఇందులో నేరుగా జోక్యం చేసుకోలేదు. ఒకవేళ ఓవైసీ ఒత్తిడికి లొంగి ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ పరిధిలో నిబంధనలు సడలిస్తే అది లీగల్ వివాదాలకు దారితీస్తుంది. ఏది ఏమైనా, ఈ స్పెషల్ రివిజన్ ప్రక్రియ ముగిసే సరికి పాతబస్తీ రాజకీయ చిత్రపటంలో ఊహించని మార్పులు రావడం ఖాయంగా కనిపిస్తోంది.

# భోజ్ శాలలో శుక్రవారం నమాజ్‌కు అనుమతి

ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర చర్యగా ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 1 నుండి 3 గంటల మధ్య ఆ స్థలం సమీపంలో ప్రార్థనలు చేసుకునేందుకు ముస్లింలకు అనుమతి ఇస్తూ ఆదేశాలు వెలువరించింది. ఇవి సున్నితమైన అంశాలని, ఉద్రిక్తతలకు దారితీసే లేదా శాంతిభద్రతల పరిస్థితిని ప్రభావితం చేసే ఎలాంటి ఉత్తర్వులను మనం జారీ చేయకూడదని సీజేఐ పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై తుది విచారణను మూడు వారాల తర్వాత చేపడతామని ధర్మాసనం తెలిపింది. అదే సమయంలో, కోర్టు ముందస్తు అనుమతి లేకుండా ఆ కట్టడంలో ఎలాంటి నిర్మాణపరమైన మార్పులు చేయకూడదని ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే తాత్కాలిక చర్యగా, ఇరు పక్షాల హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా ఆ స్థలానికి ఆనుకుని లేదా సమీపంలో ముస్లింలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఏర్పాటు తుది తీర్పునకు లోబడి తాత్కాలికంగా మాత్రమే ఉంటుందని ధర్మాసనం తెలిపింది.

# జెట్ స్పీడ్‌తో ఆర్ఆర్ఆర్ పనులు

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

### అమరావతి మీదుగా బందరు పోర్టుకు 12 వరుసల రహదారి మంజూరు చేయండి

ఆర్ఆర్ఆర్ రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తవుందుని, నిర్మాణ వ్యయం తగ్గుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం విజ్ఞప్తి చేశారు.

భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్-విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను బందరు పోర్ట్‌కు సరకు రవాణా వేగవంతమవుతుందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

### మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతులివ్వండి

మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ తాము చేపడతామని సీఎం తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ దితరులు పాల్గొన్నారు.

## సింగరేణికి పట్టిన శని

# ఆ రెండు పార్టీలే

ఇప్పుడు దాని భవిష్యత్తును పూర్తిగా అంధకారంలోకి నెట్టేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సింగరేణి నుంచి బొగ్గు కొనుగోలు చేసి, విద్యుత్ వాడుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను తుంగలో తొక్కిందన్నారు.

గత కేసీఆర్ ప్రభుత్వం సుమారు రూ. 30 వేల కోట్ల బకాయిలు పెట్టిపోతే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానికి మరో రూ. 24 వేల కోట్లు జోడించిందని మండిపడ్డారు. ఇలా మొత్తం రూ. 54 వేల కోట్ల కార్మికుల కష్టార్జితాన్ని అప్పులపాలు చేసి, సంస్థను ఆర్థిక సంక్షోభంలోకి తోశారని ఆరోపించారు. కేసీఆర్ తన హయాంలో సింగరేణి బోర్డును ఉత్సవ విగ్రహంగా మార్చి, టెండర్ల పేరుతో భారీ దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు. రాజకీయాలు చేయడానికి తాను ఇక్కడికి రాలేదని, సింగరేణిని కాపాడుకోవడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గత పాలకులు సంస్థ ఆదాయాన్ని ఫుట్‌బాల్ మ్యాచ్‌లు వంటి అనవసరమైన వాటికి మళ్లించారని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ హయాంలో సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయించి కార్మికులకు అసలైన భరోసా కల్పించామన్నారు. సింగరేణి మనుగడ కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా కేంద్రం అండగా నిలబడుతుందని, కార్మికుల ప్రయోజనాలను కాపాడి తీరుతామని ఆయన హామీ ఇచ్చారు.

# సమస్య రాకముందే పసిగట్టాలి.. అదే సమర్థత

### డేటా ఆధారిత పాలన.. నెలవారీ నివేదికలతో సమీక్ష

డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో రియల్ టైమ్ ఫలితాలు సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. దీనికోసం దేశంలోనే మొదటిసారిగా నెలవారీ ఆర్థిక నివేదికల (మంత్లీ ఎకనామిక్ రిపోర్ట్స్ - ఎంఈఆర్) ద్వారా రాష్ట్ర ప్రగతిని సమీక్షించుకునే విధానానికి శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. "ఇకపై ప్రతీ నెలా ఆర్థిక నివేదికలు విడుదల చేస్తాం. వాటి ఆధారంగా ప్రభుత్వ శాఖల పనితీరు, రెవెన్యూ రాబడులు, అధికారుల నైపుణ్యాలను అంచనా వేసుకుని ముందుకు వెళ్తాం. ప్రతీ నెలా కార్యదర్శులు, హెచ్‌వోడీలతో సమావేశమై పురోగతిని సమీక్షించుకుందాం," అని తెలిపారు.

### గత ఐదేళ్ల (2019-24) పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు

చిన్నాభిన్నమయ్యాయని, విధ్వంసం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. "గత రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం సమిష్టిగా పనిచేసి, క్షేత్రస్థాయిలో కొంతవరకు మార్పు తేగలిగాం. గత పాలనలో పారిశ్రామికవేత్తలకు ఏపీపై నమ్మకం పోయింది. మేం వచ్చాక పరిస్థితి మార్చి, దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ ఇప్పుడు పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానం" అని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా 'స్వర్ణాంధ్ర-2047' విజన్‌ను రూపొందించామని, తలసరి ఆదాయం, జీఎస్డీపీ వృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకున్నామని వివరించారు.

### అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని శాఖల పనితీరు సరిగా లేకపోవడంతో, ముఖ్యంగా రెవెన్యూ శాఖలో భూ వివాదాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయని పేర్కొన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)లో 'జీరో పెండెన్సీ' లక్ష్యంగా పెట్టుకోవాలని అన్ని శాఖలకు సూచించారు. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు వంటి ప్రాంతాల్లో భూ సమస్యలను పరిష్కరించామని, రీసర్వే ద్వారా ప్రతి నెలా 9వ తేదీన రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు.

### ప్రాజెక్టులు, అభివృద్ధి పనులపై స్పష్టత

రాష్ట్రంలోని జలవనరుల ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో దృష్టి సారించిందని సీఎం తెలిపారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. ఆగస్టు 14న పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేస్తామని, సెప్టెంబరు 1న వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామన్నారు. ఎల్‌నినో ప్రభావంపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఆయా శాఖల కార్యదర్శులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే

# మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారు

దిగి ఉంటే కనీసం ఆ ఐదుగురు మత్స్యకారులైనా ఈ రోజు బతికేవారు. చివరికి చైనా బోటు సాయంతో కేవలం చిన్నా ఒక్కడే సురక్షితంగా ఒడ్డుకు చేరాడు. ఇంత దారుణం జరుగుతుంటే ఈ ప్రభుత్వానికి కనీసం మానవత్వం ఉందా  అని వైఎస్ జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ నగరంలో ఉన్న వ్యవస్థల పనితీరును ప్రస్తావిస్తూ వైఎస్ జగన్  ప్రభుత్వాన్ని నిలదీశారు. "విశాఖపట్నం ఇక్కడే ఉంది అంటే దానికి అర్థం ఏంటి? విశాఖలో ఇండియన్ నేవీ హెడ్‌క్వార్టర్స్ ఉంది, కోస్ట్ గార్డు సిబ్బంది ఉన్నారు, రెస్క్యూ కోసం సిద్ధంగా ఉండే హెలికాప్టర్లు ఉన్నాయి. అలాగే ఇక్కడే కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు ఉన్నారు. ఇన్ని వ్యవస్థలు, అత్యాధునిక సాంకేతిక పరికరాలు, రెస్క్యూ విమానాలు అందుబాటులో పెట్టుకుని కూడా కేవలం 10 మైళ్ల దూరంలో సముద్రంలో కొట్టుమిట్టాడుతున్న మన మత్స్యకారులను ఎందుకు కాపాడలేకపోయారు? కేవలం పాలకుల అలసత్వం, సమన్వయ లోపం వల్లే ఆరు ప్రాణాలు సముద్రంలో కలిసిపోయాయి"  అని విమర్శించారు. బాధిత మత్స్యకార కుటుంబాలకు వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోయిన మత్స్యకారుల ప్రాణం విలువ కూటమి ప్రభుత్వం ఇస్తున్న రూ. 10 లక్షల కంటే చాలా ఎక్కువని ఆయన స్పష్టం చేశారు. ఇంకా మూడేళ్లే సమయం ఉంది.. కళ్ళు మూసి తెరిచే లోపు ఈ మూడేళ్లు గడిచిపోతాయి. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. మేము అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఈ బోటు ప్రమాదంలో మరణించిన మత్స్యకార బాధిత కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం అందిస్తాం. ఇందుకు నాదే పూర్తి బాధ్యత  అని వైఎస్ జగన్ బాధితులకు హామీ ఇచ్చారు. గల్లంతైన వారి కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పార్టీ తరపున పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

# పెరుగుతున్న ఈఎంఐలు..

ప్రాధాన్యతనిస్తున్నారు. గృహాల ధరలు, వడ్డీ రేట్లు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, దశాబ్దాల పాటు గృహ రుణాలకు కట్టుబడి ఉండటం కంటే, అద్దె ఇళ్లలో నివసిస్తూ ఆదా చేసిన సొమ్మును ఇతర మార్గాల్లో పెట్టుబడిగా పెట్టేందుకే మొగ్గు చూపుతున్నారు. గృహ రుణాల ఈఎంఐలతో పోలిస్తే, నెలవారీ అద్దె చెల్లింపులే తక్కువగా ఉండటం దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఏళ్ల తరబడి రుణ భారాన్ని మోయడం కంటే, ఆ నిధులను ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయడం ద్వారా త్వరగా ఆర్థిక స్వేచ్ఛను సాధించవచ్చని నేటి తరం భావిస్తోంది. అంతేకాకుండా, అద్దె ఇళ్లలో నివసించడం వల్ల మెరుగైన ఉపాధి అవకాశాల కోసం ఇతర నగరాలకు సులభంగా మారే వెసులుబాటు ఉంటుందని, ఇది తమ కెరీర్ పురోగతికి తోడ్పడుతుందని వారు విశ్వసిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో యువ కొనుగోలుదారుల సందడి కనిపిస్తున్నప్పటికీ, మెట్రో నగరాల్లో ఆస్తుల ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరడం ఈ కొత్త ధోరణికి దారితీస్తోంది. ఇంటి కొనుగోలు కోసం చెల్లించే డౌన్ పేమెంట్, ఈఎంఐ మొత్తాలను స్టాక్ మార్కెట్లలో పెట్టుబడిగా పెడితే దీర్ఘకాలంలో మెరుగైన రాబడి వస్తుందనేది వారి ప్రధాన వ్యూహం. అయితే, ఇది సొంత ఇంటి కలను పూర్తిగా వదిలిపెట్టడం కాదని, కేవలం వ్యూహాత్మకంగా వాయిదా వేసుకోవడమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నేటికీ చాలామంది యువతకు సొంత ఇల్లు అనేది ఒక భావోద్వేగపూరితమైన లక్ష్యమే. భవిష్యత్తులో వడ్డీ రేట్లు తగ్గి, ఆర్థిక పరిస్థితులు అనుకూలించినప్పుడు వీరి నిర్ణయాల్లో మార్పు రావొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, టైర్-2 నగరాల్లో మాత్రం యువత ఇప్పటికీ ఇళ్ల కొనుగోలుపై ఆసక్తి చూపుతుండటం గమనార్హం.

## అభివృద్ధికి రాజకీయాలతో

# సంబంధం లేదు

న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్టకూడదని, రాజకీయాలు కేవలం ఎన్నికల సమయానికే పరిమితం కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏర్పాటుచేయనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు వరంగల్ కేంద్రంగా ఉంటుందని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు ఇతర పరిశ్రమల రాకతో నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున విమానాశ్రయం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి కేంద్రమంత్రికి వివరించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి, 2028 జూన్ 2 నాటికి పనులన్నీ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధీనంలోని ఎయిర్‌పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయాన్ని కూడా నిర్మించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణా సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని కోరగా, దీనిపై తగిన ప్రతిపాదనలు అందజేయాలని కేంద్రమంత్రి సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రం చేయనంత వేగంగా తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండకు వరంగల్ కేంద్ర బిందువుగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. రైలు, రోడ్డు మార్గాలతో మెరుగైన అనుసంధానం ఉండటంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమలతో ఈ నగరం మరింత కీలకంగా మారుతుందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్‌ను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలను కేవలం ఎన్నికలకే పరిమితం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వివిధ అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తమకు సహకరిస్తోందని, ఏవైనా సమస్యలు ఉంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏదైనా సమాచార లోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని ఆయన వివరించారు.

# ప్రమాదాలకు చెక్. వై జంక్షన్‌లో అండర్‌పాస్.

**రెండు నెలల్లో పనులు ప్రారంభమవుతాయని ఎన్‌హెచ్ఏఐ హామీ.**

**వై జంక్షన్ అండర్‌పాస్‌కు బీఆర్ఎస్ పోరాటమే ఫలితం.**

**మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) రామాయంపేట పట్టణ ప్రవేశ ద్వారం వద్ద ఆద్య హోటల్ సమీపంలోని వై జంక్షన్‌లో అండర్‌పాస్ నిర్మాణానికి మార్గం సుగమం కావడం బీఆర్ఎస్ చేపట్టిన నిరంతర ఉద్యమాల ఫలితమేనని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ కార్యాలయంలో రీజినల్ ఆఫీసర్ శివశంకర్‌ను మంగళవారం కలిసి వై జంక్షన్ సమస్యపై వినతిపత్రం అందజేశారు అనంతరం ఈసందర్భంగా మాట్లాడుతూ..వై జంక్షన్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ సమస్యను పలుమార్లు ప్రభుత్వంతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులు అండర్‌పాస్ నిర్మాణానికే ఏకగ్రీవంగా మద్దతు తెలిపారని చెప్పారు.ప్రమాదాల్లో కుటుంబ పెద్దలను కోల్పోయిన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కోమటిపల్లి నుంచి కేసీఆర్ కాలనీ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వరకు సుమారు కిలోమీటరు మేర అండర్‌పాస్ నిర్మించాలని అధికారులను కోరినట్లు తెలిపారు. దీంతో కోమటిపల్లి, గొల్లిపర్తి, కేసీఆర్ కాలనీ ప్రజలతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ విద్యార్థులకు సురక్షిత రాకపోకలు కలుగుతాయని పేర్కొన్నారు.వై జంక్షన్‌ను బ్లాక్‌స్పాట్‌గా గుర్తించినప్పటికీ ఇంతకాలం అండర్‌పాస్ మంజూరు కాకపోవడం బాధాకరమని అన్నారు. అయితే టెండర్ ప్రక్రియ పూర్తైందని, మరో రెండు నెలల్లో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఎన్‌హెచ్ఏఐ అధికారులు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ ముందుండి పోరాటం కొనసాగిస్తుందని, ప్రజా ప్రయోజనాల కోసం ఉద్యమాలు ఆగవని పద్మా దేవేందర్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బాదే చంద్రం, మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, కౌన్సిలర్లు చౌదరి చరిత, కొక్కు ప్రవీణ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు ఉమామహేశ్వర్, హస్నొవుద్దీన్, రొయ్యల నవీన్, దోమకొండ శ్రీనివాస్, రాచూరి శ్రీనివాస్, నీల రాజు, బాసం శీను, వంశీ, దాకి బునీత్, తాటిపల్లి రామ్‌కీ, శ్రీకాంత్ సాగర్, శ్రావణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం వదు

**- రైతు కూలీ సంఘం ఆగ్రహం**

**సాగునీరు, విద్యుత్, గిట్టుబాటు ధర కల్పించాలి**

**డిమాండ్లు నెరవేర్చకపోతే ఆందోళన తప్పదు: లతక్క హెచ్చరిక**




ఏటూరునాగారం(ప్రశ్న న్యూస్) రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సాగునీటి సరఫరాలో జాప్యం, విద్యుత్ కోతలు, ఎరువులు విత్తనాల కొరతతో పాటు పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం ఏటూరునాగారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు.

**రైతు కూలీ సంఘం నాయకురాలు లతక్క మాట్లాడుతూ**

ప్రభుత్వం రైతులను పూర్తిగా మరిచిపోయింది. ఖరీఫ్ సీజన్ వచ్చినా కాలువలకు నీరు లేదు. 9 గంటల కరెంటు అంటారు కానీ 3 గంటలు కూడా సరిగా రావడం లేదు. ఎరువులు, విత్తనాల కోసం గంటల కొద్దీ క్యూలో నిలబడాలి. పండించిన పంటకు కనీస ధర కూడా ఇవ్వడం లేదు. రుణభారంతో రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలి. లేకుంటే మేము రోడ్డెక్కక తప్పదు.” ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని, పాత రుణాల భారం కారణంగా రైతులు కొత్త రుణాలు తీసుకోలేక సతమతమవుతున్నారని చెప్పారు. ధాన్యంతో పాటు ఇతర పంటలకు కూడా కనీస మద్దతు ధర కల్పించి, కొనుగోలు కేంద్రాలను గ్రామస్థాయిలో ఏర్పాటు చేయాలని కోరారు.
రైతులకు అవసరమైన ప్రభుత్వ సహాయాన్ని తక్షణమే అందించాలని, పంట నష్టపరిహారం, బీమా సొమ్ము వెంటనే చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రైతాంగ సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తమ డిమాండ్లు పరిష్కారం కాకపోతే సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా, మండల నాయకులు పద్మక్క, కొమురయ్య, రమేష్, స్వామి ముస్కు చంద్ర రెడ్డి తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# టీడీపీ కార్యకర్త కుటుంబానికి డాక్టర్ లలిత్ సాగర్ భరోసా

**మృతుడు బత్తుల రామస్వామికి నివాళి.. కుటుంబ సభ్యులను పరామర్శించిన యువ నాయకుడు: డాక్టర్ లలిత్ సాగర్**



దర్శి (ప్రశ్న న్యూస్) ముండ్లమూరు మండలం ఉమా మహేశ్వరపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త బత్తుల రామస్వామి అనారోగ్యంతో మృతి చెందడంతో, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. అనంతరం రామస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, “అధైర్యపడవద్దు.. పార్టీ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుంది” అని డాక్టర్ లలిత్ సాగర్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కూరపాటి శ్రీను, టీడీపీ నాయకులు దేవినేని కోటేశ్వరావు, వైస్ ఎంపీపీ వేముల జానకిరామయ్య, బేతపూడి రామారావు, సొసైటీ అధ్యక్షులు కాటూరి గురవయ్య, సోమేపల్లి కొండయ్య, మేనక సాంబయ్య తదితరులు పాల్గొని రామస్వామికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని

# కలాన్ని నమ్ముకున్న జర్నలిస్టుకు కన్నీళ్లే మిగిలాయా.?

## గజ్జెల శ్రీనివాస్ విషాదం.. క్షేత్రస్థాయి పాత్రికేయుల భద్రతపై ప్రశ్నలు

ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా భావించే జర్నలిజం నేడు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. సమాజ సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవడం, అన్యాయంపై గొంతెత్తడం వంటి బాధ్యతలను మోస్తున్న పాత్రికేయుల జీవిత భద్రత మాత్రం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకప్పుడు సమాజంలో గౌరవం, విశ్వసనీయత పొందిన ఈ వృత్తి నేడు అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ప్రజల కోసం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే క్షేత్రస్థాయి జర్నలిస్టులు అవసర సమయంలో ఒంటరిగా మిగిలిపోతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి.రాజకీయ నాయకుల ఎదుగుదలలో, ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం. ఒక నాయకుడి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది కూడా మీడియానే. కానీ అదే జర్నలిస్టు కష్టాల్లో ఉన్నప్పుడు, అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు లేదా మరణించినప్పుడు అండగా నిలిచే వ్యవస్థ బలహీనంగా ఉండటం బాధాకరం.కేవలం రాజకీయ నాయకులే కాదు, మీడియా సంస్థల బాధ్యత కూడా ఈ సందర్భంలో చర్చకు వస్తోంది. క్షేత్రస్థాయిలో ఎండా వానా లెక్కచేయకుండా వార్తల కోసం తిరిగే జర్నలిస్టులకు అనేక సంస్థలు సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత, కుటుంబ భరోసా కల్పించలేకపోతున్నాయి. ఒక జర్నలిస్టు ఆకస్మికంగా మరణిస్తే అతని కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం కనిపించకపోవడం వ్యవస్థలోని లోపాలను బయటపెడుతోంది.ఇలాంటి పరిస్థితులకు అద్దం పట్టే ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన పాత్రికేయుడు -గజ్జెల శ్రీనివాస్ మరణం.గత పదేళ్లుగా జర్నలిజం వృత్తిలో కొనసాగిన శ్రీనివాస్.. సామాన్య ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో తన వంతు పాత్ర పోషించారు. గ్రామీణ ప్రాంత ప్రజల కష్టాలు, స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన ఆయన ఆకస్మిక మరణం కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది.భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో ఉన్న ఆ కుటుంబం ఇప్పుడు భవిష్యత్తుపై ఆందోళనలో ఉంది. సమాజం కోసం పనిచేసిన ఒక జర్నలిస్టు కుటుంబం ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవడం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది. గజ్జెల శ్రీనివాస్ ఘటన ఒక్క కుటుంబానికి సంబంధించిన విషాదం మాత్రమే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది క్షేత్రస్థాయి జర్నలిస్టుల జీవిత భద్రతపై ఒక ప్రశ్న. జర్నలిస్టులను కేవలం వార్తలు అందించే వ్యక్తులుగా కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక భాగస్వాములుగా గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు, మీడియా యాజమాన్యాలు, జర్నలిస్టు సంఘాలు కలిసి వారి కుటుంబాల భద్రతకు స్పష్టమైన విధానాలను రూపొందించాల్సిన సమయం ఆసన్నమైంది.అలాగే జర్నలిస్టులు కూడా వృత్తిపరమైన భేదాలను పక్కనపెట్టి, ఆపద సమయంలో ఒకరికొకరు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. గజ్జెల శ్రీనివాస్ కుటుంబానికి సానుభూతి మాత్రమే కాదు.. భవిష్యత్తుకు భరోసా అవసరం. ఒక జర్నలిస్టు కుటుంబం రేపటి రోజున అనాథగా మారకుండా ఉండేందుకు సమాజం, ప్రభుత్వం, మీడియా వ్యవస్థ కలిసి బాధ్యత తీసుకోవాలి. ఎందుకంటే... ప్రజల కోసం కలం పట్టే చేతులకు భద్రత లేకపోతే, ప్రజల గొంతుకను వినిపించే స్వరాలు క్రమంగా నిశ్శబ్దమయ్యే ప్రమాదం ఉంది.



**వొడ్యాల వేణు**
**సీనియర్ పాత్రికేయుడు**

# గుడిసెలు లేని గ్రామాలే తీర్చిదిద్దటమే లక్ష్యం

**- నిజమైన అర్హులను గుర్తించి ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇందిరమ్మ ఇల్లు అందించాలి**

**- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హులైన కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు కొల్చారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని హౌసింగ్ పీడీ మాణిక్యం తాసిల్దార్ శ్రీనివాస చారి ఎంపీడీవో రహీం మున్నీసా బేగం, సర్పంచ్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు.ముందుగా రెండో విడతలో ప్రాధాన్యతనిచ్చే గుడిసెల ధ్రువీకరణ, మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, రెండో విడత లబ్ధిదారుల ఎంపిక సంబంధిత వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం ఉండేలా అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేసే దిశగా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. మొదటి విడతలో మంజూరై సంవత్సరం కావస్తుందని ఇప్పటికీ ప్రారంభించని లబ్ధిదారుల విషయంలో ఇండ్లు మొదలుపెట్టే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రెండో విడత కూడా జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం మంజూరు అవుతుంది కాబట్టి మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లాలో మొదటి విడతలో 9వేల ఇండ్లు మంజూరు కాగా ఇందిరమ్మ ఇండ్ల పురోగతి 83% పూర్తయిందని ఇప్పటివరకు 1700 ఇండ్లు నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశం చేయడం జరిగిందన్నారు. 2400 ఇండ్లు స్లాబ్ పూర్తి చేసుకుని ఫెన్సింగ్ దశలో ఉన్నాయన్నారు 650 ఇండ్లు రూఫ్ లెవెల్లో ఉన్నాయన్నారు. 1400 ఇండ్లు బేస్ మెంట్ లెవెల్లో ఉన్నాయన్నారు మిగతా ఇండ్లు పునాది దశలో ఉన్నాయని తెలిపారు ఇప్పటివరకు 1600 ఇండ్లు లబ్ధిదారులు ఇంకను మొదలుపెట్టలేదని త్వరితగతిన మొదలుపెట్టే విధంగా అవగాహన కల్పించాలన్నారు. దారిద్య రేఖకు దిగువన ఉండి నిరుపేద కుటుంబాల వారికి మహిళా సంఘ గ్రూపుల ద్వారా రుణాలు మంజూరు చేసి ఇండ్లు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పథకంలో భాగంగా జిల్లాలో గుడిసెల సర్వే పూర్తయిందని తెలిపారు. గుడిసెల్లో నివాసం ఉండే వారికి మొదటి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం లక్ష్యాలకు అనుగుణంగా. ముందుకు సాగే విధంగా అధికారుల కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కొల్చారం సర్పంచ్ దేవన్న గారి శేఖర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణలో రాజీ వద్దు

## - ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్ ఆదేశం




ములుగు(ప్రశ్న న్యూస్)జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి అర్ధ వార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని అన్ని స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ విచారణలు, నేరాల స్వభావంపై ఎస్పీ సమగ్ర సమీక్ష చేశారు. ప్రధానంగా దొంగతనాలు, గంజాయి అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వినియోగం, కల్తీ మద్యం, గుడుంబా తయారీ, రోడ్డు ప్రమాదాలు, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై చర్చించారు.

**గస్తీ, సాంకేతికతతో దొంగతనాల కట్టడి..**

జిల్లాలో దొంగతనాలను అరికట్టేందుకు ప్రస్తుతం ఉన్న గస్తీ విధులను మరింత పెంచాలని ఎస్పీ ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాలు, మారుమూల ప్రాంతాల్లో నిఘా పెంచాలన్నారు. నేర నియంత్రణలో సాంకేతికతను వినియోగించాలని సూచించారు. “మారుమూల గ్రామాల ప్రజలకు సీసీ కెమెరాల వల్ల కలిగే ఉపయోగాలను వివరించి, వారిని భాగస్వామ్యం చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలి. ఇది నేరాల నివారణకు ఎంతో ఉపయోగపడుతుంది” అని ఎస్పీ తెలిపారు.

**గంజాయిపై ఉక్కుపాదం..**

గంజాయి అక్రమ రవాణా, వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామస్థాయి వరకు బలమైన ఇన్ఫార్మర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా క్రమం తప్పకుండా వాహన తనిఖీలు చేపట్టాలని, యువత గంజాయికి అలవాటు పడుతున్న హాట్‌స్పాట్లను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

**కల్తీ మద్యం, గుడుంబాపై కఠిన చర్యలు..**

కల్తీ మద్యం తయారు చేసేవారు, గుడుంబా ముఠాలపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ హెచ్చరించారు. గ్రామస్తుల సహకారంతో జిల్లాను క్రమంగా గుడుంబా రహిత గ్రామాలుగా మార్చేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

**కోర్టు కేసుల్లో జాప్యం వద్దు..**

కోర్టుల్లో విచారణలో ఉన్న కేసుల పురోగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కోర్టు కానిస్టేబుల్స్ పనితీరును నిత్యం పర్యవేక్షించాలని, సాక్ష్యాధారాలు, సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరిచి నేరస్తులకు తప్పకుండా శిక్ష పడేలా కృషి చేయాలన్నారు.“పెండింగ్ కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు. నేర నియంత్రణలో ఎలాంటి రాజీకి తావులేదు” అని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ ఏటూరునాగారం మనన్ బట్ ఐపీఎస్, అదనపు ఎస్పీ సదానందం, డీసీఆర్బీ డీఎస్పీ కిషోర్ కుమార్, డీఎస్పీ ములుగు రవీందర్, సీఐలు, ఎస్ఐలు, డీసీఆర్బీ ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక సేవలకు గుర్తింపుగా మహమ్మద్ సుల్తాన ఉమర్‌కు 'నేషనల్ సేవా రత్న' అవార్డు

గజ్వేల్( ప్రశ్న న్యూస్ ) సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజాసేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్కు ప్రతిష్ఠాత్మక 'నేషనల్ సేవా రత్న' అవార్డు ప్రదానం చేశారు.హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జేబీ రాజు, జన సాహిత్య అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు డా. పాముల రమణ సంయుక్తంగా ఈ పురస్కారాన్ని అందజేశారు. అనంతరం ఆమెను శాలువాతో సత్కరించి ఘనంగా అభినందించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ ద్వారా నిరుపేదలు, మహిళలు, అనాథలు, సంచార జాతుల సంక్షేమం కోసం మహమ్మద్ సుల్తాన ఉమర్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఆమె సామాజిక బాధ్యతతో నిరంతరం ప్రజలకు అండగా నిలుస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు.అవార్డు అందుకున్న అనంతరం మహమ్మద్ సుల్తాన ఉమర్ మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి ప్రతిష్ఠాత్మక పురస్కారంతో సత్కరించిన జన సాహిత్య అకాడమీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా సమాజ సేవను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని చెప్పారు.
ఈ కార్యక్రమంలో జై భీమ్ టీవీ ఫౌండర్ బరిగల శివ, ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉపేందర్, రజక సంఘం రాష్ట్ర నాయకులు ముత్యాల నర్సింలు, జన సాహిత్య అకాడమీ సభ్యులు సత్యనారాయణతో పాటు సామాజిక, సాహిత్య, ప్రజా సంఘాల ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొని మహమ్మద్ సుల్తాన ఉమర్‌ను అభినందించారు.



# ప్రజాస్వామ్య స్ఫూర్తితో నారాయణ పాఠశాలలో స్కూల్ క్యాబినెట్ ఎన్నికలు

**విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపే లక్ష్యం**



శేరిలింగంపల్లి(ప్రశ్న న్యూస్) విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించేందుకు నారాయణ స్కూల్స్ ఎల్‌పీ బ్రాంచ్‌లో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన స్కూల్ క్యాబినెట్ ఎన్నికలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ ఎన్నికలు విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. నిజమైన ప్రజాస్వామ్య విధానాన్ని ప్రతిబింబించేలా ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. పోటీ చేసిన అభ్యర్థులు తమ నాయకత్వ సామర్థ్యాలను విద్యార్థులకు వివరించగా, అనంతరం విద్యార్థులు క్రమశిక్షణతో తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఓటింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాణానికి నాయకులని, వారిలో బాధ్యత, నాయకత్వ నైపుణ్యాలు, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను పెంపొందించడమే స్కూల్ క్యాబినెట్ ఎన్నికల ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, పాఠ్యాంశాలతో పాటు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే కార్యక్రమాలకు నారాయణ విద్యాసంస్థలు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తాయని తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణలో విద్యార్థులు ప్రదర్శించిన క్రమశిక్షణ, ప్రజాస్వామ్య స్ఫూర్తి అందరినీ ఆకట్టుకుంది.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు.

**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్.**




మంథని ( ప్రశ్న న్యూస్) మంథని వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపులో భాగంగా చలో సెక్రటేరియట్ కార్యక్రమం లో భాగంగా తెల్లవారుజామున ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ జిల్లా ఉపాధ్యక్షుడు బందెల రాజ్ కుమార్ ను మంథనిలో అక్రమంగా అరెస్టు చేయడం జరిగింది ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను జిల్లావ్యాప్తంగా అక్రమంగా అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం దున్నపోతు మీద వర్షం పడ్డ చందంగా వ్యవహరిస్తుందని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇప్పటివరకు యూనిఫాంలు ఇవ్వలేదని పాఠ్యపుస్తకాలు కూడా సరిపడా ఇవ్వకుండా ప్రభుత్వం విద్యార్థులను చిన్నచూపు చూస్తుందని ఖాళీగా ఉన్న ఎంఈఓ,డిఈఓ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు అద్దె భవనాలలో కొనసాగుతున్న గురుకుల,ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని విద్యార్థులకు రావలసినటువంటి ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ లు రాక ప్రైవేట్ కళాశాలలో సర్టిఫికెట్లు ఇవ్వకుండా యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులను చదువుకు దూరం చేయాలనే ఆలోచనతోనే స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటలాడుతుందని మండిపడ్డారు వెంటనే రాష్ట్రప్రభుత్వం పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు.

# గంగపుత్రులను తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించి రాజకీయ ప్రాధ్యాత కల్పించాలి

- సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత కల్పించాలలి
- సీఎం ప్రజావాణి ఇంచార్జి డాక్టర్ చిన్న రెడ్డికి వినతి పత్రం అందజేసిన

**టిజిఎస్ రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బేగంపేట్ లో గల మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్ లో తెలంగాణ సీఎం ప్రజావాణి ఇంచార్జ్ రాష్ట ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ చిన్నా రెడ్డిని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మర్యాదపూర్వకంగా కలిసి తెలంగాణ రాష్ట సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న సాంప్రదాయ మత్యకార గంగపుత్ర కులస్తులను ఉద్యమకారులుగా గుర్తింపుతో పాటు రాష్ట ప్రభుత్వ నియమిత పదవులలో సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత కల్పించాలని డాక్టర్ చిన్న రెడ్డికి వినతి పత్రం అందచేశారు అనంతరం తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచూ తెలంగాణ రాష్టంలో సాంప్రదాయ మత్యకార గంగపుత్ర కులస్తులు కేవలం చేపల వేట చేపలం అమ్మకమే కుల వృత్తిగా జీవనం సాగిస్తూ నిరు పేదరికంలో ఉన్నారన్నారు కావున గంగపుత్ర కులస్తులను తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తిస్తూ రాష్ట ప్రభుత్వ నియమిత పదవులలో సంక్షేమ పథకాలలో గంగపుత్రులకు మొదటి ప్రాధాన్యత కల్పించగలరని విజ్ఞప్తి గంగపుత్ర చేశారన్నారు

# సీనియర్ జర్నలిస్టు గజ్జెల శ్రీనివాస్ గుండెపోటుతో కన్నుమూత

- బూరుగుపల్లిలో శోకసంద్రంలో ముగిసిన జర్నలిస్టు అంత్యక్రియలు
- పాత్రికేయ రంగానికి తీరని లోటు
- శ్రీనివాస్ మృతికి ప్రముఖుల సంతాపం





సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు గజ్జెల శ్రీనివాస్ శనివారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు. శనివారం సాయంత్రం సుమారు 5:30 గంటల సమయంలో ఆయనకు గుండెపోటు రావడంతో కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. నిర్భయంగా, నిష్పాక్షికంగా వార్తలను ప్రజలకు అందించడంలో గజ్జెల శ్రీనివాస్ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన మరణం పాత్రికేయ రంగానికి తీరని లోటని సహచర జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పేర్కొంటూ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. జర్నలిస్ట్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని పలువురు కోరారు. మృతునికి భార్య అమృత, కుమార్తెలు భార్గవి (16), సాయి శరణ్య (12), సృజన్ (7) ఉన్నారు.- ఆదివారం నాడు స్వగ్రామమైన బూరుగుపల్లిలో గజ్జెల శ్రీనివాస్ అంత్యక్రియలు కుటుంబ సభ్యులు, బంధువులు, సహచర జర్నలిస్టుల సమక్షంలో అధికారికంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన పార్థివదేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు ప్రార్థించారు.

# మంథని నియోజకవర్గం లో సింగరేణి మెడికల్.

**మైనింగ్ కళాశాలలు మంజూరు చేయాలని.**
**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కి వినతి పత్రం అందజేసిన .**
**బిజెపి రాష్ట్ర నాయకులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి.**



మంథని( ప్రశ్న న్యూస్ ) కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి మంథని నియోజకవర్గ బీజేపీ నాయకులు ఒక వినతి పత్రాన్ని రిప్రజెంటేషన్ ను సమర్పించారు. మంథని నియోజకవర్గ కేంద్రంలో విద్యార్థుల కోసం ఒక సింగరేణి మెడికల్ కళాశాల లేదా సింగరేణి మైనింగ్ కళాశాలను మంజూరు చేయాలని, అలాగే స్థానిక నిరుద్యోగ నిర్మూలన కోసం సింగరేణి కోల్ మైన్స్‌కు అనుసంధానంగా ఈ ప్రాంతంలో ఒక పరిశ్రమను ఏర్పాటు చేయాలని వారు ఆ వినతి పత్రంలో కోరారు.

**వినతి పత్రంలోని ముఖ్య అంశాలు:**

విద్యా, ఉద్యోగ అవకాశాల కొరత మారుమూల ప్రాంతమైన మంథని నియోజకవర్గం తాడిచర్ల ఓసి పి సింగరేణి కాలరీస్ ఆర్ జి-2, ఆర్ జి-3, ఓసిపి 2 ఏరియాలను ఆనుకొని ఉన్నప్పటికీ, ఇక్కడ విద్యార్థులకు, నిరుద్యోగులకు సరైన అవకాశాలు లేవని నేతలు పేర్కొన్నారు.వలసల నివారణ మారుమూల మంథని నియోజకవర్గ ప్రాంతం నుండి దేశ ప్రధానిగా, ముఖ్యమంత్రిగా, స్పీకర్‌గా, మంత్రులుగా, షాడో సీఎం లుగా కేంద్ర, రాష్ట్ర రాజకీయాలను శాసించే నాయకులు ఉన్నప్పటికీ.. ఇక్కడి నిరుద్యోగుల కొరకు ఒక్క పరిశ్రమ కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా నిరుద్యోగులు ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరు, బొంబాయి వంటి నగరాలకు వలసలు పోతున్నారని వివరించారు.పరిశ్రమల ఏర్పాటు అవశ్యకత చదువుకున్న నిరుద్యోగులు రోజురోజుకూ పెరిగిపోతూ, గ్రామాల్లో వ్యవసాయ దారులుగా, రోజువారీ కూలీలుగా మారి తమ సృజనాత్మక ఆలోచనలను కోల్పోతున్నారని.. కాబట్టి తక్షణమే సింగరేణి అనుసంధానంతో ఒక పరిశ్రమను ఏర్పాటు చేసి యువతను ఆదుకోవాలని కోరారు.ఈ వినతి పత్రాన్ని భారతీయ జనతా పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు పెద్దపల్లి చంద్రపట్ల సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో మంథని నియోజకవర్గ బీజేపీ నేతలు మంత్రి కిషన్

# మాదాపూర్ వార్డులో పౌర సమస్యలపై కమిషనర్ సమీక్ష

**"వన్ వార్డ్ ఎవ్రీ డే" కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలిసి ప్రజలతో ముఖాముఖి**



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన "వన్ వార్డ్ ఎవ్రీ డే" కార్యక్రమంలో భాగంగా కమిషనర్, స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, వివిధ శాఖల అధికారులతో కలిసి కూకట్‌పల్లి జోన్ పరిధిలోని మాదాపూర్ వార్డును సందర్శించి పౌర సమస్యలను సమీక్షించారు.మాదాపూర్‌లోని సిలికాన్ వ్యాలీ పార్క్‌లో నిర్వహించిన సమావేశంలో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలతో అధికారులు నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బోర్‌వెల్ మరమ్మతులు, భూగర్భ మురుగునీటి వ్యవస్థ అభివృద్ధి, తాగునీటి సరఫరా, తక్కువ నీటి ఒత్తిడి, ట్యాంకర్ సేవలు, రహదారుల మరమ్మతులు, అభివృద్ధి పనుల వల్ల పేరుకుపోయిన శిథిలాలు, వ్యర్థాల తొలగింపు వంటి అంశాలను స్థానికులు ప్రస్తావించారు.అలాగే ఆక్రమణల తొలగింపు, అక్రమ పార్కింగ్ నియంత్రణ, పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు, చిన్నారుల ఆట పరికరాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, పార్కుల వద్ద పెట్రోలింగ్ పెంపు, చెట్ల కొమ్మల కత్తిరింపుతో ఏర్పడే వ్యర్థాల సకాలంలో తొలగింపు అంశాలపై కూడా చర్చ జరిగింది.సీఎన్ తండా శ్మశానవాటిక సమస్యలు, చెత్త నిర్వహణ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు, హాస్టళ్లలో నీటి వినియోగం, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను కూడా ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై ప్రాధాన్యత ఆధారంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. అవసరమైన చోట ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ, మాదాపూర్ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి మెరుగైన పౌర సదుపాయాలను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.వార్డు స్థాయిలో ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వేగంగా పరిష్కరించడమే "వన్ వార్డ్ ఎవ్రీ డే" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కమిషనర్ పేర్కొన్నారు.

# సీడబ్ల్యూసీ గోదాం నిర్మాణానికి స్థల పరిశీల

**సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద పరిశీలించిన జిల్లా కలెక్టర్, అధికారులు**



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ) గోదాం నిర్మాణానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్థల పరిశీలన చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద జిల్లా ఇందిరా మహిళా శక్తి భవనం సమీపంలో సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ) గోదాం నిర్మాణానికి మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సీడబ్ల్యూసీ ఆర్‌ఎం ఎం విష్ణువర్ధన్, రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సర్వే నంబర్, ఎన్ని ఎకరాల స్థలం అందుబాటులో ఉందో ఆరా తీశారు. ఎన్ని ఎకరాల్లో ఎన్ని టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తారని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ మహేష్, సీడబ్ల్యూసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లాలో వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం, జిల్లాలోని కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో ఎస్ ఐ ఆర్ ను తాసిల్దార్ ఎంపీడీవోతో కలిసి బిఎల్వోలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను క్షేత్రస్థాయిలో ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ బూత్ స్థాయిలో ఫారాల పంపిణీ, స్వీకరణ, డేటా ఎంట్రీ పురోగతిపై ఆరా తీశారు.ఫారాలు పంపిణీ చేయడం మాత్రమే కాకుండా, పూర్తిగా పూరించిన దరఖాస్తులను తిరిగి సేకరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబాన్ని సంప్రదించాలని, ఒక కుటుంబంలో ఒక సభ్యుడి మ్యాపింగ్ పూర్తయితే మిగిలిన అర్హులైన సభ్యులందరికీ మ్యాపింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇంకా ఫారాలు సమర్పించని కుటుంబాలను గుర్తించి, ప్రత్యేకంగా తిరిగి సంప్రదించాలన్నారు.మరణించిన, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసి, నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలన్నారు.బిఎల్ఓలు ఓటర్లతో మర్యాదగా వ్యవహరించి, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు.ఈ పర్యటనలో కొల్చారం తహసిల్దార్ శ్రీనివాస్ చారి ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా ఆర్ ఐ శ్రీవిద్య , బిఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

# బాలవికాస్, కాఫేడు సంస్థల సహకారంతో ముత్తారం, సూరవీడు కాలనీలలో నూతన బోర్‌వెల్స్ ప్రారంభం



వెంకటాపురం (ప్రశ్న న్యూస్) గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో బాలవికాస్ సంస్థ మరియు కాపెడ్ సంస్థల సంయుక్త సహకారంతో వెంకటాపురం మండలంలోని ముత్తారం గ్రామం మరియు సూరవీడు కాలనీలో నూతన బోర్‌వెల్స్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముత్తారం గ్రామ సర్పంచ్, కార్యదర్శి, సూరవీడు కాలనీ గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. బాలవికాస్ సంస్థ తరఫున శ్రీ ప్రశాంత్ , కాపెడ్ సంస్థ తరఫున డైరెక్టర్ బ్రదర్ కె. లూర్దు రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా కరువు పరిస్థితుల్లో స్వచ్ఛమైన తాగునీరు ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండటం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బాలవికాస్ సంస్థ సహకారంతో ఈ బోర్‌వెల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామ ప్రజలు ఈ బోర్‌వెల్స్‌ను తమ సొంత ఆస్తిగా భావించి, వాటిని జాగ్రత్తగా వినియోగించుకోవడంతో పాటు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా సంరక్షించాలని సూచించారు. ముత్తారం గ్రామం సూరవీడు కాలనీ ప్రజలు ఈ బోర్‌వెల్స్ ఏర్పాటు చేయడం వల్ల తమ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ క్లిష్టమైన కరువు సమయంలో తమ గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించిన బాలవికాస్ సంస్థ క్యాఫెడ్ సంస్థలకు గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.గ్రామీణ ప్రజల సంక్షేమం, తాగునీటి భద్రత మరియు సమాజాభివృద్ధి కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

## వంశధారకు గండి- అధికారులపై అచ్చెన్న ఆగ్రహం

- 'యుద్ధప్రాతిపదికన పూడ్చండి.. మళ్లీ నిర్లక్ష్యం సహించం'
- ఖరీఫ్‌లో సాగునీటికి ఆటంకం కలగొద్దని ఇరిగేషన్ అధికారులకు మంత్రి ఆదేశం



**కోటబొమ్మాళి(ప్రశ్న న్యూస్)** శ్రీకాకుళం జిల్లా రైతాంగానికి జీవనాడిగా భావించే వంశధార ఎడమ ప్రధాన కాలువకు గండి పడిన ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఖరీఫ్ సాగు ప్రారంభమైన కీలక సమయంలో కాలువ భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మండిపడ్డారు. రైతులకు సాగునీరు అందించడంలో ఎలాంటి ఆటంకం తలెత్తకుండా వెంటనే గండిని పూడ్చివేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. సారవకోట మండలం గుమ్మపాడు గ్రామం అక్కివలస సమీపంలో వంశధార ఎడమ ప్రధాన కాలువకు గండి పడిన విషయం తెలుసుకున్న మంత్రి వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. అత్యవసర యంత్రాంగాన్ని రంగంలోకి దించి యుద్ధప్రాతిపదికన పూడ్చివేత పనులు చేపట్టాలని ఆదేశించారు. పనులు పూర్తయ్యే వరకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలని సూచించారు.

### ప్రతి నీటి చుక్కా పొలాలకు చేరాలి

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీటి కొరత తలెత్తకుండా ప్రతి నీటి చుక్కా చివరి ఆయకట్టుకు చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రధాన కాలువలు, శాఖ కాలువలు, బలహీన ప్రాంతాలను ముందుగానే గుర్తించి మరమ్మతులు చేపట్టడంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిరంతర తనిఖీలు, నిర్వహణ లోపించడంతోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

### రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం

రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు. సాగునీటి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులను ఉపేక్షించబోమని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే బాధ్యులపై కఠిన శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రధాన కాలువలతో పాటు చెరువుల గట్లు, నీటి నిల్వ నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు మంత్రి ఆదేశించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగేలా అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## ఉప్పల్ ప్రెస్ క్లబ్ ( ప్రింట్, ఎలక్ట్రానిక్) ఆధ్వర్యంలో ఘనంగా బోడ ప్రవీణ్ జన్మదిన వేడుకలు



**ఉప్పల్(ప్రశ్న న్యూస్)** ఉప్పల్ ప్రెస్ క్లబ్ (ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా) ఆధ్వర్యంలో క్లబ్ ఉపాధ్యక్షుడు బోడ ప్రవీణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు బోడ ప్రవీణ్‌ను పూల గుచ్ఛం, శాలువా, జ్ఞాపికతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం కోసం బోడ ప్రవీణ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆయన ఆయురారోగ్యాలతో, ఆనందంగా మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ ( ప్రింట్ ఎలక్ట్రానిక్) సభ్యులు ఇడపాక సురేష్, కదుకూరి ప్రశాంత్, బి వి రాజ్, షేక్ పాషా,నెమ్మది వెంకన్న, పలువురు జర్నలిస్టులు పాల్గొని బోడ ప్రవీణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజలలో నుండి ఉద్భవించిన నాయకుడు పవన్ కళ్యాణ్

- మండలాధ్యక్షుడు చిన్నతోటి నాగరాజు
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి
- ప్రజా నాయకుడికి ఎల్లవేళలా ప్రజల ఆశీస్సులు
- పట్టణ అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి
- జనసేన రథసారథి ఆరోగ్యంగా ఉండాలని పూజలు



**రేణిగుంట** రాష్ట్ర ప్రజల అభివృద్ధి ప్రదాత ప్రజా నాయకుడు జనసేన పార్టీ అధినేత రథసారథి రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిన్నతోటి నాగరాజు, పట్టణ అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి జన సైనికులతో కలిసి శివాలయంలో పూజలు నిర్వహించారు. సోమవారం పరమశివుడికి అత్యంత పవిత్రమైన రోజు కావడంతో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిన్న తోటి నాగరాజు, పట్టణ అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీకాళహస్తి రోడ్డు నందు గల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నతోటి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల గుండెచప్పుడు పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన శ్రామికుడు అని అన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనం కోసం నిరంతరం పోరాడే యోధుడని అన్నారు. భగవంతుని ఆశీస్సులతో ముంబైలో జరిగిన శస్త్ర విజయవంతమైందని ఆనందం వ్యక్తం చేశారు. పట్టణ అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు, పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశీస్సులు ఉన్నంతకాలం అధినాయకుడుకు ఏమి కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి,మండల ఉప అధ్యక్షులు దేవలం జగదీష్,పార్థ సారధి , ఐటీ కో ఆర్డినేటర్ దీన దయాల్, సీనియర్ నాయకులు త్యాగరాజు, వార్డ్ మెంబెర్ సీనియర్ న్యాయవాది మహబూబ్ బాషా, రమేష్ రెడ్డి ,మునికృష్ణ ,సలీం ,రమేష్ ,శేఖర్ ,నాగప్ప ,సతీష్ ,వీరామహిళలు గంగ,సాయి పూర్ణిమ, అదేమ్మ ,సుజాత మరియు జనసైనికులు, వీరామహిళలు పాల్గొన్నారు.

# పెట్రోల్ మాఫియాకు అండగా మారిన కొందరు మీడియా వ్యక్తులు.?

- ఘట్‌కేసర్,మేడిపల్లి, చర్లపల్లి, మల్లాపూర్‌లో అక్రమ పెట్రోల్ దందా జోరు - పోలీసుల దాడులు జరిగినా మారని మాఫియా
- పంపకాల కోసం రిపోర్టర్ల మధ్యే గొడవలు - అవినీతిని ప్రశ్నించాల్సిన వారే అక్రమాలకు అండగా ఉంటే ప్రజలు ఎవరిని నమ్మాలి.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాల్సిన కొందరు రిపోర్టర్లు అక్రమ పెట్రోల్ మాఫియాకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ఘట్‌కేసర్, మేడిపల్లి, చర్లపల్లి, మల్లాపూర్ ప్రాంతాల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. అక్రమాలను బయటపెట్టాల్సిన వారే మాఫియాలకు బ్రోకర్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.గతంలో పలుమార్లు పోలీసులు అక్రమ పెట్రోల్ నిల్వ కేంద్రాలపై దాడులు చేసి కేసులు నమోదు చేసిన మాఫియా కార్యకలాపాల్లో ఎలాంటి మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా పెట్రోల్ నిల్వ చేయడం, విక్రయించడం, అధికారులకు సమాచారం లీక్ చేయడం, మాఫియాతో ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం వంటి ఆరోపణలు కొందరు మీడియా ప్రతినిధులపై వినిపిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మాఫియా నుంచి వచ్చే ప్యాకేజీలు, పంపకాలు విషయంలో కొందరు రిపోర్టర్ల మధ్యే విభేదాలు తలెత్తి, ఒకరిపై ఒకరు దాడులు చేసుకుని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసుకునే స్థాయికి వ్యవహారం వెళ్లిందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజల అవినీతి, అక్రమాలను తరఫున ప్రశ్నించాల్సిన వ్యక్తులు స్వలాభాల కోసం ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోవడం మీడియా ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇలాంటి వారు నిజంగా రిపోర్టర్లా... లేక బ్రోకర్లా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిజాయితీగా పనిచేస్తున్న విలేకరుల ప్రతిష్ఠను కూడా ఇలాంటి చర్యలు మసకబార్చుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాను. కొందరి వ్యవహారాల వల్ల మొత్తం మీడియా వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు పెరిగే ప్రమాదం




ఉందని అభిప్రాయపడుతున్నారు.ఘట్‌కేసర్, మేడిపల్లి, చర్లపల్లి, మల్లాపూర్ ప్రాంతాల్లో నడుస్తున్న అక్రమ పెట్రోల్ స్థావరాలపై స్థానిక పోలీసులు, ఎస్‌వోటీ, సివిల్ సప్లై అధికారులు, సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ సంయుక్తంగా ప్రత్యేక దాడులు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ వ్యాపారులకు అండగా నిలుస్తున్న వారెవ్వరైనా, వారి హోదా ఏదైనా సరే, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.అక్రమాలపై నిరంతరం పోరాడాల్సిన మీడియా వర్గాల్లోనే కొందరు వ్యక్తులు మాఫియాలతో చేతులు కలిపితే ప్రజాస్వామ్యానికి అది ప్రమాదకర సంకేతమని సామాజిక వర్గాలు హెచ్చరిస్తున్నాయి. అక్రమాలపై రాజీ పడకుండా పనిచేసే నిజాయితీ గల విలేకరులను కాపాడాలంటే, మీడియా పేరుతో బ్రోకరేజ్ చేస్తున్న వారిని గుర్తించి చట్టం ముందు నిలబెట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

# రాజన్న సిరిసిల్లలో అరుదైన రాతి చిత్రాలు

## కంగారూ, బల్లిని పోలిన రాతి చిత్రాల గుర్తింపు

సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) సముద్ర జీవులను పోలిన రాతి చిత్రాలను కనుగొన్న 'మట్టి ఫౌండేషన్' బృందం, ఈసారి ఏకంగా సముద్ర ద్వీపాల్లో ఉండే జంతువులను పోలిన చిత్రాలను వెలుగులోకి తెచ్చింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా, టాస్మేనియా, న్యూగినియా ద్వీపాలలో మాత్రమే కనిపించే కంగారూ, ఎకిడ్నా వంటి జంతువులను పోలిన ప్రాచీన రాతి చిత్రాలను రాజన్న సిరిసిల్ల



జిల్లాలో ఈ బృందం గుర్తించింది.

పసిఫిక్, హిందూ మహాసముద్రాల సరిహద్దుల్లో, ఆస్ట్రేలియాకు ఆగ్నేయంగా ఉన్న టాస్మానియా ద్వీప రాష్ట్రం, అలాగే ఆస్ట్రేలియాకు ఉత్తరాన ఉన్న న్యూగినియా ద్వీపాల్లో నివసించే జంతువుల చిత్రాలు ఇక్కడ లభించడం నమ్మశక్యంగా లేదని పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి అన్నారు. మొదట అనేక సందేహాలు కలిగినా, ఈ చిత్రాలను పరిశీలిస్తే ప్రాచీన మానవుడి మేధస్సుకు ఏదైనా సాధ్యమేననిపిస్తోందని ఆయన తెలిపారు. గతంలో మద్రాస్ విశ్వవిద్యాలయానికి చెందిన పురావస్తు పరిశోధకుడు జిను కోషి నేతృత్వంలోని బృందం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ,కర్నూలు జిల్లాలోని కునుకుంట్ల, రాచర్ల పరిసర ప్రాంతాలలో జరిపిన అన్వేషణలో కంగారూ రాతి చిత్రాలు వెలుగులోకి వచ్చాయనీ గుర్తు చేశారు. పరిశోధన వివరాలు: డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి ఆధ్వర్యంలో దేశెట్టి జితేందర్, కూన ప్రతాప్, కరికె బాబు, గన్నె జగదీష్, కాంసాని కిషోర్, సముద్రాల రాజు, కొలిపాక రోహిత్, కాసగోని సృజన్, అనిల్‌లతో కూడిన బృందం రాజన్న సిరిసిల్ల జిల్లా, ముస్తాబాద్ మండలం, గన్నెవారిపల్లె గ్రామం శివారులోని మైసమ్మ గుట్టను అధిరోహించింది. భౌగోళిక స్థానం: అక్షాంశం: 18.312944, రేఖాంశం: 78.756481 ఎత్తు: సముద్ర మట్టానికి సుమారు 407 మీటర్లు, భూమి ఉపరితలం నుండి 399 మీటర్లు.ఈ గుట్ట



దిగువన ఉన్న మైసమ్మ గండి వద్ద పాత రాతియుగం, సూక్ష్మ రాతియుగ కాలం నాటి పనిముట్లు లభించాయి. ముళ్ళ పొదలను దాటుకుంటూ గుట్టపైకి వెళ్లిన బృందానికి, తూర్పు ముఖంగా ఉన్న ఒక పడగ రాయి కింద ఎరుపు, ముదురు ఎరుపు రంగుల్లో ఉన్న అనేక చిత్రాలు కనిపించాయి.రాతి చిత్రాల ప్రత్యేకతలు: కంగారూ చిత్రం: ఈ గుహకు ప్రధాన ఆకర్షణ లేత ఎరుపు రంగుతో నింపిన, పొడవైన దేహంతో ఉన్న కంగారూ చిత్రం. ఇది మేత మేసే పొజిషన్‌లో ఉంది. జంతువు ఒక పక్క భాగం మాత్రమే చిత్రించడం వల్ల ఒక కన్ను, చెవులు, పొడవైన లావుపాటి తోక కనిపిస్తున్నాయి. అయితే, బ్రతికి ఉన్న కంగారూకు ఉండే వెనుక కాళ్ళకు వ్యతిరేక దిశలో ఇక్కడి చిత్రంలో కాళ్ళు గీయడం గమనార్హం. సుదూర ఆస్ట్రేలియా భూభాగం నుండి సముద్రాలు దాటి దక్కన్ పీఠభూమికి వచ్చిన ప్రాచీన మానవులు, ఆ జ్ఞాపకాలతో ఈ చిత్రాన్ని గీసినప్పుడు కాళ్ళు వ్యతిరేక దిశలో వేసి ఉండవచ్చు లేదా పూర్వం ఇక్కడే కంగారూ జాతి జీవించి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఎకిడ్నా : పడగ రాయి పైకప్పుపై ఒళ్ళంతా ముళ్ళతో, చిన్న తలతో ఉన్న ఎకిడ్నాను పోలిన చిత్రం ఉంది. ఇది కూడా ప్రస్తుతం ఆస్ట్రేలియా, టాస్మేనియాలోనే కనిపిస్తుంది. ఇతర జీవులు: కంగారూతో పాటు మరో జంతువు కూడా ఆకర్షణగా ఉంది. ముదురు ఎరుపు రంగులో వేసిన చిత్రం ఏ జంతువు అయి ఉంటుందో ఊహించడం కష్టంగా ఉంది.పడగ రాయి కింద ఉన్న శిలలపై ముదురు ఎరుపు రంగులో గుర్రం లేదా గాడిదలను పోలిన చిత్రాలున్నాయి. సున్నం వేయడంతో, వర్షం కారణంగా చిత్రాలను గుర్తు పట్టలేనంతగా మారిపోయాయి.వీటితో పాటు తాబేలు, బల్లి, పాము, చేయి పైకెత్తకుండా , ఒకే ఒక నిరంతర రేఖతో గీసిన ఐదు కోణాల నక్షత్రాలు మొదలైన చిత్రాలు ఉన్నాయి. విచిత్ర వృత్తం: కంగారూ చిత్రంపై ఒక వృత్తం చుట్టూ



మూడు పంగల కర్రల వంటి చిత్రాలు ఉన్నాయి. ఆ వృత్తం సముద్రాన్ని, పంగల కర్రలు చెట్లను సూచిస్తూ ఉండవచ్చు (అవి త్రిశూలాలు కావు). చిత్రాల కాలం: చిత్రాలపై చిత్రాలు ఉండటం, అక్కడ లభించిన రాతి పనిముట్ల ఆధారంగా ఇవి మధ్య శిలాయుగం ఆరంభంలో, నవీన శిలాయుగంలో వేసినట్లు తెలుస్తోంది. తొలి దశ చిత్రాలు క్రీ.పూ. 10,000 సంవత్సరాల నాటివి కావచ్చు. చిత్రాలకు ఎదురుగా ఉన్న గ్రూవ్స్, నక్షత్రాల వంటి చిత్రాలు క్రీ.పూ. 5,000 ఏళ్ల నాటివి అయి ఉండవచ్చు.

### సాంకేతిక ఆధారాలు:

ఈ చిత్రాల స్థావరం ముందున్న ఒక శిల ఉపరితలంపై లోతైన గ్రూవ్స్ (రాపిడి గుర్తులు) ఉన్నాయి. ఇవి రాతి పనిముట్లను నూరుకునే పరిశ్రమను గుర్తుచేస్తున్నాయి. గుహ ముందు హెమటైట్ (ఇనుప ఖనిజం) రంగు రాళ్లు లభించాయి. ఈ రాళ్లను పొడి చేసి, జంతువుల కొవ్వు లేదా మొక్కల జిగురుతో కలిపి అప్పట్లో రంగులు తయారు చేసేవారు. సమీపంలోని నక్క వాగు తీరాన పరుపు బండలపై కూడా విస్తారంగా గ్రూవ్స్, సూక్ష్మ రాతి పనిముట్లు లభించాయి. ప్రభుత్వానికి మట్టి ఫౌండేషన్ విజ్ఞప్తి:పురావస్తు శాఖ ఈ చిత్రాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి, ఇవి కంగారూ, ఎకిడ్నా చిత్రాలేనని నిర్ధారిస్తే.. మానవ పరిణామ క్రమంలో ఇదొక సుదీర్ఘమైన, ప్రమాదకరమైన మానవ వలసగా చరిత్రలో నిలిచిపోతుంది. మానవ నాగరికత, జ్ఞాపకశక్తిపై సరికొత్త చర్చ జరుగుతుంది.

ప్రస్తుతం స్థానికులు ఈ ప్రాంతాన్ని మైసమ్మ దేవతగా భావించి పూజలు చేస్తున్నారు. అయితే, భవిష్యత్తులో ఈ చిత్రాలపై సున్నం వేసే ప్రమాదం పొంచి ఉంది. సమీపంలోని తంగళ్లపల్లి మండలం, లచ్చపేట నరసింహస్వామి గుట్టపై ఉన్న గుహలోని చిత్రాలకు ఇలాగే సున్నం వేసి పాడుచేశారు. కాబట్టి, ప్రభుత్వం, పురావస్తు శాఖ స్పందించి గన్నేవారిపల్లి రాతి చిత్రాలను తక్షణమే రక్షించాలని మట్టి ఫౌండేషన్ కోరుతోంది.

# అబద్ధాల పునాదులపై పుట్టిందే వైసీపీ'

- మత్స్యకారుల సంక్షేమంపై జగన్‌కు నైతిక హక్కు లేదన్న మంత్రి అచ్చెన్నాయుడు- అభివృద్ధిపై బహిరంగ చర్చకు సవాల్

అమరావతి(ప్రశ్న న్యూస్) అబద్ధాలు, అసత్య ప్రచారంతో రాజకీయాలు చేయడం వైసీపీ నైజమని, మత్స్యకారుల సంక్షేమంపై ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాట్లాడే నైతిక హక్కు లేదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. విశాఖ పర్యటనను ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నారని ఆరోపించారు. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.విశాఖ సముద్రంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా ఆరుగురు మత్స్యకారులు గల్లంతైన ఘటనపై సమాచారం అందిన వెంటనే ప్రభుత్వం యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి సహాయక చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశాయని పేర్కొన్నారు. అయితే ఈ ఘటనను కూడా రాజకీయాలకు వేదికగా మార్చేందుకు జగన్ ప్రయత్నించారని విమర్శించారు.విశాఖ తీరంలో ప్రమాదం జరిగిన ప్రదేశం 10 నాటికల్ మైళ్ల దూరంలో ఉండగా, దానిని 10 కిలోమీటర్లలోపే జరిగిందని జగన్ వ్యాఖ్యానించడం ఆయనకు కనీస అవగాహన కూడా లేదనే విషయాన్ని వెల్లడిస్తోందన్నారు. నాటికల్ మైళ్లు, కిలోమీటర్ల మధ్య తేడా తెలియకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా 277 మంది మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయినా, అప్పటి ముఖ్యమంత్రి ఒక్క కుటుంబాన్ని కూడా పరామర్శించలేదని అచ్చెన్నాయుడు ఆరోపించారు. ప్రస్తుతం విశాఖ ఘటనలో బాధితుల ఆచూకీ పూర్తిగా తెలియకముందే ప్రభుత్వం కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించిందని, ఆ సహాయాన్ని కూడా 'ముష్టి'గా అభివర్ణించడం బాధితులను అవమానించడమేనని అన్నారు.ప్రతి మత్స్యకార పడవకు ట్రాన్స్‌పాండర్లు ఏర్పాటు చేసి, అత్యవసర పరిస్థితుల్లో అలారం బటన్ నొక్కగానే ప్రభుత్వానికి సమాచారం చేరేలా ఆధునిక వ్యవస్థను అమలు చేశామని తెలిపారు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ట్రాన్స్‌పాండర్‌ను వినియోగించకపోవడంతో గల్లంతైన వారి ఆచూకీ వెంటనే లభించలేదని వివరించారు.మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న మంత్రి, గత ప్రభుత్వం ఐదేళ్లలో మత్స్యకార భరోసా పథకం కింద రూ.531 కోట్లు ఖర్చు చేయగా, కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రూ.511 కోట్లు మత్స్యకారులకు అందజేసిందని వెల్లడించారు. పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు కొత్త బోట్లు, వలలు, తెప్పల పంపిణీని పునఃప్రారంభించినట్లు తెలిపారు.మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన రోడ్డు ప్రమాదం కేసులో



నిజాలను దాచిపెట్టే ప్రయత్నం జరిగినప్పటికీ, సీసీటీవీ దృశ్యాలతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని మంత్రి పేర్కొన్నారు. ప్రమాదం అనంతరం బాధితుడిని వెంటనే ఆస్పత్రికి తరలించి ఉంటే ప్రాణాలు దక్కే అవకాశం ఉండేదన్నారు. చట్టం ముందు ఎవరూ అతీతులు కాదని, ఈ కేసులోనూ న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిపై వైఎస్ జగన్‌తో ఎప్పుడైనా, ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. ప్రజల ముందే వాస్తవాలు వెల్లడించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే రోజులు ముగిశాయని ఆయన వ్యాఖ్యానించారు.

# పార్టీ మారం.. పార్టీలోనే ఉంటాం

**సుఖాంతమైన గుండ్ల పోచంపల్లి కాంగ్రెస్ నేతల రగడ**

**పార్టీలోనే ఉంటామని రాజీనామా చేసిన కాంగ్రెస్ నేతలు**

**ఫలించిన కాంగ్రెస్ సీనియర్ నేతల ప్రయత్నం**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి కాంగ్రెస్ నేతల రగడ సుఖాంతమైంది. గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్ష పదవిని ఆశించి భంగపడ్డ కాంగ్రెస్ నేతలు ముక్కుముడిగా రాజీనామా చేశారు. ఆ గ్రామ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బండారి నరేందర్ కాంగ్రెస్ గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్ష పదవి కోసం ప్రయత్నించారు. అయితే పార్టీ అధిష్టానం మాత్రం బండారి నరేందర్ ను కాకుండా గౌడవెల్లి కి చెందిన మాజీ సర్పంచ్, రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధికార ప్రతినిధి కాంగ్రెస్ సీనియర్ నేతగరిసెల సురేందర్ ముదిరాజ్ కు గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్షులుగా ఇచ్చారు. దీంతో గుండ్ల పోచంపల్లి లో నేతలు రెండు వర్గాలుగా విడిపోయి ఒక వర్గం అందరూ రాజీనామా చేశారు. దీంతో జిల్లా పార్టీ నాయకత్వం జోక్యం చేసుకొని రాజీనామా చేసిన నేతలను తమ రాజీనామాలను ఉపసంహరించుకొని పార్టీలోనే ఉంటాం అనేలా చేశారు

### ఫలించిన నక్క ప్రభాకర్ ప్రయత్నం

రాజీనామా చేసిన కాంగ్రెస్ నాయకులను తమ రాజీనామాలు ఉపసంహరించుకునేలా కాంగ్రెస్ సీనియర్ నేత నక్క ప్రభాకర్ చేసిన ప్రయత్నాలు ఫలించాయి.రాజీనామా చేసిన నేతలు తమ భవిష్యత్తును నిర్ణయించుకునేందుకు గుండ్ల పోచంపల్లి లో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశానికి భారీ ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు హాజరయ్యారు.

### అలిగిన బండారి నరేందర్

గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్ష పదవిని ఆశించి భంగపడ్డ మాజీ సర్పంచ్ బండారి నరేందర్ కార్యకర్తల సమావేశానికి రావడానికి నిరాకరించాలని తెలుస్తుంది. దీంతో గుండ్ల పోచంపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్, మాజీ జెడ్పిటిసి సాయి పేట శ్రీనివాస్ తన అనుచరులతో బండారి నరేందర్ ఇంటికి వెళ్లి బుజ్జగించే ప్రయత్నం చేశారు. అప్పటికి బండారి నరేందర్ వినకపోవడంతో చివరి క్షణంలో కాంగ్రెస్ సీనియర్ నేత నక్క ప్రభాకర్ వచ్చి బంధారి నరేందర్ ను బుజ్జగించారు. బండారి నరేందర్ కు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని నచ్చ చెప్పడంతో బండారి నరేందర్ సమావేశానికి హాజరయ్యారు

### పార్టీని వీడం

రాజీనామా చేసిన కాంగ్రెస్ నేతలు తమ భవిష్యత్తును నిర్ణయించుకోవాలని ఏర్పాటు చేసిన సమావేశంలో చివరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నక్క ప్రభాకర్ సూచనల మేరకు, కార్యకర్తల సూచనల మేరకు, బండారి నరేందర్ తో పాటు, గుండ్ల పోచంపల్లి డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయి పేట శ్రీనివాస్, ఆయన అనుచరులు పార్టీని వీడం అని పార్టీలోనే ఉంటామని ప్రకటించారు. దీంతో గత కొద్ది రోజులుగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. అందరం కలిసికట్టుగా పనిచేసి గుండ్ల పోచంపల్లి లో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

### కోవర్టులను ఏరి వేస్తాం

పార్టీలో కొందరు కోవాట్లు ఉన్నారని వారిని ఏరి వేస్తామని పార్టీ నేతలు పేర్కొన్నారు. కోవర్టుల వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని, వారిని గుర్తించి పార్టీ నుండి తరిమికొడతామని పేర్కొన్నారు. పదవి ఉన్నా లేకున్నా పార్టీ అభివృద్ధికి పాటుపడతామని రాజీనామా చేసిన కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో టికెట్ ఎవరికీ ఇచ్చినా కలిసికట్టుగా పనిచేసే విజయం కోసం కృషి చేస్తామని తెలిపారు.

# నూతన గృహప్రవేశంలో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ - లలిత్ సాగర్ దంపతులు

**మేదరమెట్ల వీరనారాయణ - లక్ష్మీదేవి దంపతులకు**

**శుభాకాంక్షలు తెలిపిన దర్శి టీడీపీ ఇంచార్జ్**



ముండ్లమూరు(ప్రశ్న న్యూస్) ముండ్లమూరు మండలానికి చెందిన టీడీపీ నాయకులు మేదరమెట్ల వీరనారాయణ – లక్ష్మీదేవి దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి దర్శి టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు నూతన గృహంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, వీరనారాయణ – లక్ష్మీదేవి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వారి కుటుంబం ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, మండలంలోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన గృహ యజమానులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

# పారిశుద్ధ్య కార్మికులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నామ్‌స్టే' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**తిరుపతి,** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'నామ్‌స్టే' కార్యక్రమాన్ని పారిశుద్ధ్య కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. స్థానిక పిజిఆర్ఎస్ హాల్ నందు నిర్వహించిన నామ్‌స్టే దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. వారి సామాజిక, ఆర్థిక భద్రత కోసమే ఈ పథకం తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా కార్మికులకు గుర్తింపు కార్డులు, ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు, రక్షణ పరికరాల ( పి పి ఈ కిట్లు) పంపిణీతో పాటు రూ. 5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. అలాగే, వ్యర్థాల సేకరణ వాహనాల కొనుగోలుకు రూ. 5 లక్షల వరకు వడ్డీ రాయితీ రుణాలు, వారి పిల్లలకు 10వ తరగతి వరకు ప్రీ–మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందుతాయని స్పష్టం చేశారు. అర్హులైన వారంతా తమ ఆధార్, బ్యాంక్ వివరాలతో పంచాయతీ కార్యదర్శుల వద్ద వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు.అనంతరం తిరుచానూరు పంచాయతీ పరిధిలోని కార్మికులకు రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించిన అధికారులను కలెక్టర్ అభినందించారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవితో కలిసి కార్మికులకు కొబ్బరి నూనె, డెటాల్, సబ్బులు, మాస్కులు తదితర భద్రతా సామగ్రిని పంపిణీ చేశారు.

# ఎమ్మెల్యే మల్లారెడ్డి పని అయిపోయింది..

# ఆయనే మళ్లీ గెలిస్తే గుండు గీయించుకుంటా

**కాంగ్రెస్ సీనియర్ నేత నక్క ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు**

మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పని అయిపోయిందని ఆయనే మళ్లీ ఎన్నికల లో గెలిస్తే గుండు గీయించుకుంటానని కాంగ్రెస్ సీనియర్ నేత నక్క ప్రభాకర్ సవాల్ విసిరారు. మేడ్చల్ సర్కిల్ పరిధి గుండ్ల పోచంపల్లి లో జరిగిన కార్యకర్తల సమావేశంలో నక్క ప్రభాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్లారెడ్డి మేడ్చల్ ను సర్వ నాశనం చేశారని, అందుకే ఆయన ప్రజల మధ్యకు రాకుండా ఇంట్లోనే ఉంటున్నారని ఎద్దేవా చేశారు. మేడ్చల్ లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని వీటిని పరిష్కరించాల్సిన ఎమ్మెల్యే మల్లారెడ్డి వాటిని మర్చిపోయాడని ఘాటుగా విమర్శించారు. మేడ్చల్ ఎమ్మెల్యేగా మల్లారెడ్డి ని ఎందుకు గెలిపించామాని మేడ్చల్ ప్రజలు బాధపడుతున్నారని మల్లారెడ్డి మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలవరని, ఒకవేళ గెలిస్తే తాను గుండు గీయించుకుంటారని శపథం చేశారు. తాను ఎన్ని మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తే గెలవనన్న భయంతో వేరే పార్టీల వైపు చూస్తున్నారని తెలిపారు. కానీ ఆయనకు మేడ్చల్లో నూకలు చెల్లాయి అని పేర్కొన్నారు. గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్ష పదవి కోసం ఆశపడి భంగపడ్డ బండారి నరేందర్ కు భవిష్యత్తులో గుర్తింపు ఇస్తామన్నారు.ఆయనకు అండగా ఉంటామని పేర్కొన్నారు. పదవులు ముఖ్యం కాదని కష్టపడి పని చేసే వారికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని నక్క ప్రభాకర్ తెలిపారు.

### కార్యకర్తల సూచనల ప్రకారమే పార్టీని వీడడం లేదు: సాయి పేట శ్రీనివాస్

కార్యకర్తలు సూచన ప్రకారమే కాంగ్రెస్ పార్టీని వీడడం లేదని గుండ్ల పోచంపల్లి డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి, మాజీ కౌన్సిలర్ సాయి పేట శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల అభిప్రాయ సేకరణ కోసమే ఈ సమావేశాన్ని నిర్వహించామని వారి అభిప్రాయాన్ని తీసుకొని పార్టీలో కొనసాగాలని నిర్ణయించుకున్నామని సాయి పేట శ్రీనివాస్ తెలిపారు. గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్ష పదవిని ఆశించి బంగపడ్డ బండారి నరేందర్ కు మద్దతుగా అందరం పార్టీకి రాజీనామా చేశామని, అయితే కార్యకర్తల అభిప్రాయం ప్రకారం పార్టీని వీడవద్దని నిర్ణయించుకున్నామని, కార్యకర్తల సూచనల మేరకే కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతామని సాయి పేట శ్రీనివాస్ ప్రకటించారు. పార్టీ సంక్షేమం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని, హోదాలతో సంబంధం లేకుండా పార్టీ సంక్షేమం కోసం కృషి చేస్తామని సాయి పేట శ్రీనివాస్ తెలిపారు. మాజీ



సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నేత బండారి నరేందర్ మాట్లాడుతూ పార్టీలో కోవర్టులు ఉన్నారని, వారిని పార్టీ నుండి బయటకు పంపిస్తేనే పార్టీ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తనకు గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్ష పదవి రాలేదు అని తెలవగానే తన కోసం పార్టీని వదులుకోవడానికి సిద్ధమైన కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బండారి నరేందర్ పేర్కొన్నారు. కార్యకర్తల అభిప్రాయం ప్రకారం పార్టీలోనే ఉంటూ పార్టీ సంక్షేమం కోసం కృషి చేస్తామని బండారి నరేందర్ తెలిపారు.

# నిజమైన ఉద్యమకారులను గుర్తించాలి

**కోదండరాంకు గజ్వేల్ ఉద్యమకారుల విజ్ఞప్తి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దీర్ఘకాలం పాటు పోరాడిన నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని గజ్వేల్ నియోజకవర్గ ఉద్యమకారులు ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు విజ్ఞప్తి చేశారు.
ఉద్యమకారుల గుర్తింపు కమిటీ నిర్వహించిన సమావేశానికి హాజరైన గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన ఉద్యమకారులు కోదండరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో సుమారు 14 సంవత్సరాల పాటు క్షేత్రస్థాయిలో పోరాడిన నిజమైన ఉద్యమకారులందరినీ గుర్తించి, ప్రస్తుతం ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు.ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీల మేరకు ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి, క్షేత్రస్థాయిలో పనిచేసిన జేఏసీలు, ఉద్యమ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.తెలంగాణ ఉద్యమాన్ని ఆత్మగౌరవ పోరాటంగా భావించే ఉద్యమకారులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ఎంపిక ప్రక్రియ కొనసాగాలని కోరారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ కోదండరాం, అలాగే చట్టసభల్లో ఉద్యమకారుల సమస్యలను ప్రస్తావించిన కేకే రాములు నాయక్ వంటి వారికి ఉద్యమకారుల గుర్తింపు కమిటీ బాధ్యతలు అప్పగించడాన్ని తెలంగాణ ఉద్యమకారులు స్వాగతిస్తున్నట్లు తెలిపారు. వారి నాయకత్వంలో ప్రతి అర్హుడైన ఉద్యమకారుడికి న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.అదేవిధంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు, బడుగు బలహీన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన ఉద్యమకారులకు తగిన ప్రోత్సాహం అందించడంతో పాటు ఉద్యమకారుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు రాయితీలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎల్లారెడ్డి, నరసింగరావు, డి. కృష్ణ, ఎల్లయ్య, మహమ్మద్ గౌస్, తుమ్మ కృష్ణ, బాల్‌రాజు, రమేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

# కేసుల దర్యాప్తు వేగవంతం చేసి నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలి

**- ఎస్పీ మహేష్ బి. గితే**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ప్రతి కేసులో దర్యాప్తును వేగవంతం చేసి, శాస్త్రీయ ఆధారాలతో నాణ్యమైన విచారణ చేపట్టి నిందితులకు శిక్షలు పడేలా ప్రతి అధికారి కృషి చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సిరిసిల్ల సబ్‌డివిజన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, నాన్–బెయిలబుల్ వారెంట్ల అమలు, శాంతిభద్రతల నిర్వహణ, పోలీసు సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో శాస్త్రీయ,సాంకేతిక ఆధారాలు,ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిజిటల్ ఎవిడెన్స్‌ను సమర్థవంతంగా వినియోగించాలని అన్నారు. నాణ్యమైన దర్యాప్తు ద్వారానే కోర్టుల్లో నిందితులకు శిక్షలు పడతాయని,బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుందని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి, చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. పెట్రోలింగ్ సమయంలో అనుమానితులు, పాత నేరస్తులు, రౌడీషీటర్లను మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ ద్వారా తప్పనిసరిగా తనిఖీ చేసి నేరాల నియంత్రణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించి సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికతను వినియోగిస్తూ నేరాలను వేగంగా ఛేదించి బాధితులకు సత్వర న్యాయం అందించాలన్నారు.చట్టవ్యతిరేక కార్యక్రమాలు అయిన గంజాయి,గుడుంబా, పేకాట,పిడిఎస్ రైస్,అక్రమ ఇసుక రవాణా వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచి దాడులు నిర్వహించి వాటికి అడ్డుకట్ట వేయాలని అన్నారు.ఈ సమావేశంలో డీఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, మొగిలి, మధుకర్, ఆర్ఐ సురేష్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కక్ష సాధింపుతో మళ్లీ ఎడారిగా తెలంగాణ

**ఖరీఫ్‌లో 40 వేల కోట్ల పంట నష్టం ప్రమాదం**

**- వంటేరు ప్రతాపరెడ్డి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా మీడియా సమావేశంలో బి .ఆర్.ఎస్ గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు ధోరణితో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆరోపణలు చేసింది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద రెండు పిల్లర్లు కుంగిన ఘటనను సాకుగా చూపించి, మొత్తం కాళేశ్వరం పంపింగ్ వ్యవస్థను నిలిపివేయడం వల్ల రాష్ట్ర సాగునీటి వ్యవస్థ దెబ్బతిందని విమర్శించింది.బీఆర్ఎస్ నేతల ప్రకారం, కేసీఆర్ హయాంలో పచ్చని పంటలతో కళకళలాడిన తెలంగాణ ప్రస్తుతం నీటి కొరతతో మళ్లీ ఎడారిగా మారే పరిస్థితి నెలకొంది. ఎల్లంపల్లి, మిడ్ మానేరు, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ తదితర ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో సుమారు 40 లక్షల ఎకరాల ఆయకట్టు ప్రభావితమవుతోందని తెలిపారు.
ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు దాదాపు 40 వేల కోట్ల మేర పంట నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను రాజకీయంగా బద్నాం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, రైతుల ప్రయోజనాలను పక్కన పెట్టిందని ఆరోపించారు.మాజీ మంత్రి హరీష్ రావు విసిరిన సవాల్‌ను ప్రభుత్వం స్వీకరించాలని, నెల రోజుల సమయం ఇస్తే కాళేశ్వరం ప్రాజెక్టును నడిపించి చూపిస్తామని బీఆర్ఎస్ పేర్కొంది. గజ్వేల్ నియోజకవర్గంలోని హల్దీ, కూడవెల్లి వాగులు అలాగే స్థానిక చెరువులకు వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేసింది.ప్రభుత్వం వెంటనే కాళేశ్వరం పంపులను ప్రారంభించి, మల్లన్న సాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌కు నీటి సరఫరా పునరుద్ధరించాలని కోరుతూ వచ్చే శుక్రవారం ఉదయం 10 గంటలకు కొండపోచమ్మ సాగర్ వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ నేతలు ప్రకటించారు.

# అన్న క్యాంటీన్‌లో భోజన నాణ్యతను పరిశీలించిన- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**పేదలకు రూ.5కే ఆరోగ్యకరమైన భోజనం..**

**పరిశుభ్రత పాటించడం అందరి బాధ్యత**



దర్శి(ప్రశ్న న్యూస్) దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులో ఉన్న అన్నా క్యాంటీన్‌ను దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ సందర్శించారు. క్యాంటీన్‌లో అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణ తీరును పరిశీలించి, అక్కడ భోజనం చేస్తున్న లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం నిరుపేదలకు కేవలం రూ.5కే పరిశుభ్రమైన, నాణ్యమైన, ఆరోగ్యకరమైన భోజనం అందించాలనే లక్ష్యంతో అన్నా క్యాంటీన్లను నిర్వహిస్తోందని అన్నారు. ప్రతి రోజు రుచికరమైన, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని గౌరవప్రదంగా అందించేందుకు సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.అన్నా క్యాంటీన్‌ను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆమె అన్నారు. భోజనం చేసిన తర్వాత మిగిలిన ఆహారాన్ని నేలపై వేయకుండా సమీపంలోని చెత్తబుట్టల్లో వేయాలని, క్యాంటీన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచితే అందరికీ ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని సూచించారు.“అన్నా క్యాంటీన్ మనందరిది.. దానిని శుభ్రంగా, పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. మనమందరం కలిసి ఈ మంచి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం” అని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పిలుపునిచ్చారు.

# సోషల్ మీడియాలో అసభ్య పోస్టులకు కఠిన చర్యలు తప్పవు:ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- ఫేక్ అకౌంట్లతో దూషణలు ప్రజాస్వామ్యానికి మచ్చ
- ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ నిర్ణయం స్వాగతం



**గుంటూరు,(ప్రశ్న న్యూస్)** సోషల్ మీడియాను వేదికగా చేసుకుని ఫేక్ అకౌంట్ల ద్వారా మహిళలు, ప్రజాప్రతినిధులపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఐటీడీపీ కమిటీ సభ్యులు ఆమెను కలిసి ఇటీవల సోషల్ మీడియాలో జరుగుతున్న దూషణలు, వాటి పరిణామాలపై వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ, దానిని దుర్వినియోగం చేస్తూ మహిళలు, ప్రజాప్రతినిధులపై అసభ్య పదజాలంతో దాడులు చేయడం, తప్పుడు ప్రచారాలు నిర్వహించడం ఏ మాత్రం సమర్థనీయం కాదన్నారు.సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాలు, దూషణలను అరికట్టేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడం స్వాగతించదగ్గ నిర్ణయమని పేర్కొన్నారు.చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఫేక్ అకౌంట్ల ద్వారా బూతులు, వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.మహిళల గౌరవం, భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, సోషల్ మీడియా వేదికగా జరిగే వ్యక్తిత్వ హననం, అసభ్య ప్రచారాలపై చట్టం తన పని తాను చేస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

# మహిళల సమస్యల పరిష్కారానికి ప్రతి మంగళవారం ప్రత్యేక గ్రీవెన్స్: ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- ఫిర్యాదు అందగానే నైట్ బీట్ ఏర్పాటు.. భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యం



గుంటూరు(ప్రశ్న న్యూస్) మహిళలు తమ సమస్యలను నిర్భయంగా చెప్పుకునే వేదికగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న మహిళా గ్రీవెన్స్ కార్యక్రమం మారిందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి అన్నారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళల నుంచి వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గుంటూరు శివారు ప్రాంతాల్లో గంజాయి వినియోగం, విక్రయాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని మహిళలు ఫిర్యాదు చేయడంతో వెంటనే పోలీసు అధికారులతో మాట్లాడి నైట్ బీట్ కానిస్టేబుళ్ల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయించామని, దీంతో సమస్యకు పరిష్కారం లభించిందని తెలిపారు.మహిళలు ఎదుర్కొనే చిన్నా, పెద్దా ప్రతి సమస్యను స్వయంగా విని, సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు నిరంతరం ఫాలోఅప్ చేస్తున్నామని చెప్పారు. పారిశుధ్య సమస్యలు, ఆహార విక్రయ కేంద్రాల వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులపై కూడా వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.వైన్ షాపుల వద్ద ఆకతాయిల వేధింపులు, వీధి దీపాల కొరతపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో అదనపు లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు పహారాను పెంచామని పేర్కొన్నారు. మహిళలు రాత్రి వేళల్లో కూడా భద్రంగా రాకపోకలు సాగించేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.మహిళలపై ఆర్థిక మోసాలు, చీటీ మోసాలు, ఒంటరిగా నివసించే వృద్ధ మహిళల ఆస్తుల కబ్జా యత్నాలు, కుటుంబ సమస్యలు, దొంగతనాలు వంటి అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. అలాగే విద్యార్థినులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న కళాశాలల యాజమాన్యాలతో నేరుగా మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తున్నామని చెప్పారు.ఆర్థికంగా వెనుకబడిన మహిళలు, యువతులకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం, పీ-4 కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, విద్యా సామగ్రి అందించడం వంటి కార్యక్రమాలను కూడా కొనసాగిస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# అభివృద్ధిని జీర్ణించుకోలేకే అసత్య ప్రచారం'

- చిర్ల జగ్గిరెడ్డి విమర్శలు రాజకీయ దివాలాకోరుతనమేనన్న టీడీపీ



**కొత్తపేట(ప్రశ్న న్యూస్)** కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నిరంతరం కృషి చేస్తుంటే, దానిని జీర్ణించుకోలేక మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శించారు.టీడీపీ నాయకులు మాట్లాడుతూ, మూడుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం లభించినప్పటికీ నియోజకవర్గ అభివృద్ధికి చిర్ల జగ్గిరెడ్డి చెప్పుకోదగ్గ కృషి చేయలేదన్నారు. ఇప్పుడు ప్రజల దృష్టిని మళ్లించేందుకు అసత్యాలు, అవాస్తవాలతో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని పేర్కొన్నారు. వ్యక్తిగత దూషణలు, అవమానకర వ్యాఖ్యలతో ప్రజల ఆదరణ పొందలేరని అన్నారు.నియోజకవర్గంలో రహదారులు, మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలు, ఉపాధి అవకాశాల కల్పనలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, ఆ అభివృద్ధిని చూసి ఓర్వలేకే చిర్ల జగ్గిరెడ్డి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.మట్టి, ఇసుక అక్రమాలపై మాట్లాడే నైతిక హక్కు చిర్ల జగ్గిరెడ్డికి లేదని, గతంలో ఆయన పాలనపై ప్రజలు ఇప్పటికే తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజలు వాస్తవాలను గుర్తించే గత ఎన్నికల్లో భారీ మెజారిటీతో తిరస్కరించారని గుర్తు చేశారు.ఇకనైనా వ్యక్తిగత విమర్శలు, అసత్య ప్రచారాలకు స్వస్తి పలికి ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని టీడీపీ నాయకులు చిర్ల జగ్గిరెడ్డికి సూచించారు.

# దక్షిణ కాశీ వైభవం...

# ద్రాక్షారామం దివ్య మహిమ

- త్రిలింగ క్షేత్రాలలో ఒకటి... పంచారామాల్లో ప్రముఖం - అష్టాదశ శక్తిపీఠాలలో ద్వాదశ పీఠం మాణిక్యాంబ కొలువైన పుణ్యస్థలం

(వెంకట్- ఆంధ్ర ప్రదేశ్, ప్రజా ప్రశ్న స్టేట్ బ్యూరో)



ద్రాక్షారామం... ఈ పేరు వినగానే భక్తి, చరిత్ర, శిల్పకళ, పురాణ వైభవం ఒకేసారి మనసులో మెదులుతాయి. తూర్పు గోదావరి జిల్లాలోని ఈ మహాక్షేత్రం కేవలం శివాలయం మాత్రమే కాదు... శైవ, శాక్త సంప్రదాయాలకు జీవం పోసిన ఆధ్యాత్మిక కేంద్రం. పంచారామ క్షేత్రాల్లో ఒకటిగా, త్రిలింగ క్షేత్రాల్లో ప్రముఖంగా, అష్టాదశ శక్తిపీఠాల్లో ద్వాదశ పీఠంగా, "దక్షిణ కాశీ", "వ్యాస కాశీ"గా ద్రాక్షారామం విశేష ఖ్యాతి పొందింది.

### చాళుక్యుల కళా వైభవానికి సజీవ సాక్ష్యం

ద్రాక్షారామ భీమేశ్వరాలయ నిర్మాణం తూర్పు చాళుక్యుల కాలానికి చెందినదిగా శాసనాలు తెలియజేస్తున్నాయి. చాళుక్య భీముడు నిర్మించిన ఈ దేవాలయం దాదాపు వెయ్యేళ్లకు పైగా చరిత్రను ఒడిసిపట్టుకుని నేటికీ అద్భుత వైభవంతో నిలిచింది. శిల్పకళ, రాతి నిర్మాణం, గోపురాల వైభవం సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తాయి.

### స్వయంభూ భీమేశ్వరుడు... ఉదయ సూర్య కిరణాల అద్భుతం

ద్రాక్షారామంలోని శ్రీ భీమేశ్వర స్వామివారి శివలింగం అత్యంత విశిష్టమైనది. తెల్లవారుజామున లేత సూర్యకిరణాలు శివలింగాన్ని తాకే దృశ్యం భక్తులను పరవశింపజేస్తుంది. శివలింగంపై కనిపించే నల్లటి చారలను, అర్జునుడితో కిరాత రూపంలో యుద్ధం చేసినప్పుడు శివుడు ధరించిన పులిచర్మ గుర్తులుగా భక్తులు విశ్వసిస్తారు. ఈ విశ్వాసం క్షేత్ర మహిమను మరింత పెంచుతోంది.

### మాణిక్యాంబ అమ్మవారు... శక్తిపీఠ మహిమ

ఆలయ ఈశాన్య భాగంలో అష్టాదశ శక్తిపీఠాలలో ద్వాదశ శక్తిపీఠంగా శ్రీ మాణిక్యాంబ అమ్మవారు కొలువై ఉన్నారు.

భీమేశ్వరుని దర్శించిన అనంతరం మాణిక్యాంబ అమ్మవారిని దర్శించడం విశేష ఫలితాలను ఇస్తుందని భక్తుల నమ్మకం. శైవ, శాక్త సంప్రదాయాల సమన్వయానికి ఈ క్షేత్రం ప్రతీకగా నిలుస్తుంది.

### త్రిలింగ క్షేత్రాల్లో అపూర్వ స్థానం

తెలుగు భాషకు "త్రిలింగ" అనే పదమే మూలమనే అభిప్రాయానికి ఆధారంగా చెప్పబడే మూడు మహాక్షేత్రాల్లో ద్రాక్షారామం ఒకటి. మిగిలినవి శ్రీశైలం, కాళేశ్వరం. అందుకే ద్రాక్షారామం తెలుగు సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది.

### సప్తగోదావరి పవిత్రత



పురాణాల ప్రకారం భీమేశ్వర స్వామివారికి అభిషేకం చేయడానికి సప్తఋషులు గోదావరి నదిని ఈ క్షేత్రానికి తీసుకొచ్చారని చెబుతారు. అంతర్వాహినిగా ప్రవహించే ఈ పవిత్ర జలాన్ని "సప్తగోదావరి"గా పూజిస్తారు. ఇక్కడ స్నానం చేసి స్వామివారిని దర్శిస్తే పాపాలు తొలగి పుణ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

### కవులు కీర్తించిన క్షేత్రం

శ్రీనాథుడు తన భీమేశ్వర పురాణంలో ఈ క్షేత్ర మహిమను విస్తృతంగా వర్ణించాడు. వేములవాడ భీమకవి కూడా ద్రాక్షారామ భీమేశ్వరుని గొప్పగా స్తుతించాడు. దుష్యంతుడు, భరతుడు, నలుడు, నహుషుడు వంటి మహారాజులు ఈ స్వామిని ఆరాధించినట్లు పురాణాల్లో ప్రస్తావన ఉంది.ఏడాది పొడవునా ఆధ్యాత్మిక వేడుకలుద్రాక్షారామంలో ప్రతి మాస శివరాత్రి, మహాశివరాత్రి, కార్తీక దీపోత్సవాలు, జ్వాలాతోరణ మహోత్సవం, భీష్మ ఏకాదశి దివ్య కళ్యాణం, ధనుర్మాస పూజలు, శరన్నవరాత్రులు, సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా లక్షలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారు.





### యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు

దేవస్థానం ఆధ్వర్యంలో వసతి గృహాలు, అన్నదాన సత్రం, తాగునీరు, విశ్రాంతి కేంద్రాలు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఆలయానికి సమీపంలోనే యాత్రికుల వసతి ఏర్పాట్లు ఉండటంతో దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది.చరిత్ర, పురాణం, శిల్పకళ, భక్తి--- ఈ నాలుగు మహోన్నత విలువలను ఒకే చోట ఆస్వాదించాలంటే ద్రాక్షారామం తప్పనిసరిగా దర్శించాల్సిన పుణ్యక్షేత్రం. భీమేశ్వరుని దివ్య కటాక్షం, మాణిక్యాంబ అమ్మవారి అనుగ్రహం భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను ప్రసాదించే ఈ మహాక్షేత్రం, నిజంగా తెలుగు నేల గర్వించదగిన ఆధ్యాత్మిక రత్నం.

# ముంబయిలో పవన్‌ను పరామర్శించిన: మంత్రి దుర్గేష్

- ఆరోగ్య పరిస్థితిపై ఆరా..- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష
- విశ్రాంతిలోనూ ప్రజాసేవే ధ్యేయమని ప్రశంస



**అమరావతి(ప్రశ్న న్యూస్)** ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ముంబయిలో పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో కోలుకుంటున్న పవన్ కళ్యాణ్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్‌కు జరిగిన శస్త్రచికిత్స విజయవంతం కావడం సంతోషకరమన్నారు. వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటూ వేగంగా కోలుకుంటున్నారని, త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి తిరిగి వస్తారని ఆకాంక్షించారు.శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న పరిస్థితుల్లోనూ ప్రజాసేవ, పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారంపైనే పవన్ కళ్యాణ్ దృష్టి సారించడం ఆయన అంకితభావానికి నిదర్శనమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. పార్టీ కార్యకలాపాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి అందించిన దిశానిర్దేశానికి ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన వారిలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్ కూడా ఉన్నారు.

# ఆర్‌వోబీ నిర్వాసితులకు భూ పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీష

- అభివృద్ధితో పాటు నిర్వాసితులకు న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే



**పలాస(ప్రశ్న న్యూస్)** పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) నిర్మాణం కారణంగా నిర్వాసితులైన 98 కుటుంబాలకు భూ పట్టాలను పలాస ఎమ్మెల్యే శ్రీమతి గౌతు శిరీష పంపిణీ చేశారు. పలాస పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు.నెమలి నారాయణపురం సర్వే నంబర్--346, పురుషోత్తపురం సర్వే నంబర్--51 పరిధిలోని భూములకు సంబంధించిన మొత్తం 98 మంది నిర్వాసితులకు భూ పట్టాలు అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ, అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులయ్యే కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. అర్హులైన ప్రతి నిర్వాసిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల హక్కుల పరిరక్షణ తమ బాధ్యత అని పేర్కొన్నారు.ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు ప్రతి అర్హుడికి చేరేలా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరికట్ల విఠల్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లోడగల కామేష్, మున్సిపల్ టీడీపీ నాయకులు, ఆర్డీవో, ఎమ్మార్వో, నిర్వాసిత కుటుంబాల సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# దాతల ప్రివిలేజీల్లో మార్పులు

- నేటి అర్ధరాత్రి నుంచే కొత్త నిబంధనలు
- టీటీడీ బోర్డు కీలక నిర్ణయాలు.. ఎస్ఎస్‌డీ భక్తులకు కొత్త షెడ్లు..
- ఒంటిమిట్టలో 100 గదుల విశ్రాంతి గృహం




**తిరుమల(ప్రశ్న న్యూస్)** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వివిధ ట్రస్టులు, పథకాలకు విరాళాలు అందించే దాతలకు కల్పిస్తున్న ప్రివిలేజీల్లో కీలక మార్పులు చేయాలని టీటీడీ బోర్డు నిర్ణయించింది. కొత్త విధానం మంగళవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానుండగా, ఇప్పటికే విరాళాలు అందించిన దాతలకు మాత్రం ప్రస్తుతం అమలులో ఉన్న ప్రివిలేజీలు యథావిధిగా కొనసాగనున్నాయి. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర మీడియాకు వివరాలు వెల్లడించారు.దాతల విరాళాల నిర్వహణలో పారదర్శకత, ఏకరీతి తీసుకురావడమే లక్ష్యంగా అన్ని ట్రస్టులు, పథకాలకు ఒకే విధమైన నిబంధనలు అమలు చేయనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. భక్తులకు మెరుగైన సేవలు, ఆలయాల అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల విస్తరణకు బోర్డు పలు కీలక నిర్ణయాలు తీసుకుందని చెప్పారు.

**ఎస్ఎస్‌డీ భక్తులకు శాశ్వత వసతి:** తిరుమలలో ఎస్ఎస్‌డీ టోకెన్లు పొందిన భక్తులు వేచి ఉండేందుకు ఆళ్వార్ ట్యాంకు సమీపంలో రూ.6.31 కోట్లతో శాశ్వత షెడ్లు, క్యూలైన్లు, మరుగుదొడ్లు నిర్మించేందుకు టెండర్లకు ఆమోదం తెలిపారు. కుమారధార, పసుపుధార డ్యామ్‌ల భద్రత కోసం రూ.2.77 కోట్లతో డబుల్ లేన్ వంతెన నిర్మాణానికీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**ఒంటిమిట్టకు పెద్దపీట :** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం రూ.17.84 కోట్లతో 100 గదుల విశ్రాంతి గృహ నిర్మాణానికి టెండర్లను ఆమోదించారు. ఆలయ ఈశాన్య మాడవీధి విస్తరణ, యాత్రికుల సౌకర్యాల కోసం భూసేకరణకు రూ.2.11 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించారు. మూలవిరాట్టులకు బంగారు కవచాల తయారీ కోసం టీటీడీ ట్రెజరీలోని వెయ్యి గ్రాముల బంగారాన్ని వినియోగించనున్నారు.

**గ్రీన్ ఎనర్జీ.. వేదపండితుల నియామకం :** తిరుమలలో గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని పెంచేందుకు 800 కిలోవాట్ల విండ్ టర్బైన్ జనరేటర్‌ను విరాళంగా ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపారు. వేద పరిరక్షణలో భాగంగా వేద పారాయణ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 791 మంది వేదపండితులను సంభావన పండితులుగా నియమించాలని నిర్ణయించారు.

**ఇతర కీలక నిర్ణయాలు:** తిరుమలలో 25 ఏళ్లుగా పేరుకుపోయిన ఘన వ్యర్థాల శాస్త్రీయ శుద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేశారు. తిరుమల, తిరుపతిలోని టీటీడీ ఆలయాలు, వసతి సముదాయాల్లో అగ్నిమాపక వ్యవస్థల నిర్వహణకు రూ.2.35 కోట్లు కేటాయించారు. పాత భవనాల స్థానంలో దాతల సహకారంతో కొత్త భవనాల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు. 2027 సంవత్సరానికి 10 లక్షల డైరీలు, 13.50 లక్షల 12 పేజీల క్యాలెండర్లు, 75 వేల 6 పేజీల క్యాలెండర్ల ముద్రణకు ఆమోదం తెలిపారు. అలాగే తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధి, ఆక్టోపస్ బేస్ క్యాంప్ మౌలిక సదుపాయాల విస్తరణ, కళాకారుల పారితోషికాల పెంపు, క్యాంటీన్ విభాగంలోని సర్వర్ పోస్టుల అప్‌గ్రేడ్ వంటి పలు ప్రతిపాదనలకు టీటీడీ బోర్డు ఆమోదం తెలిపింది.

# అక్రమ రేషన్ బియ్యం దందా : ఆటో సీజ్

## మీర్‌పేటలో జర్నలిస్టుల అప్రమత్తతతో ఆటో పట్టివేత

- డ్రైవర్ సంచలన వ్యాఖ్యలు.. "డాన్ బబ్లు, యూసఫ్ దే సరుకు" అని వెల్లడి
- సివిల్ సప్లై అధికారులు నిద్రలోనా.? దాడులు చేయకుండా మాఫియాకు అండగా నిలుస్తున్నారా.? అనే అనుమానాలు
- బొంగులూరు గేటు, (మంగళపల్లి), పెద్ద అంబర్‌పేటలో యథేచ్ఛగా సాగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా




**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** ప్రజలకు అందాల్సిన పేదల రేషన్ బియ్యం అక్రమ రవాణా మళ్లీ జోరందుకుంది. మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో టీఎస్--08--యూఎల్--9896 నంబర్ గల ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని జర్నలిస్టులు గుర్తించి పోలీసులకు అప్పగించడం కలకలం రేపింది. ఈ ఘటనతో అక్రమ రేషన్ బియ్యం మాఫియా కార్యకలాపాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి.పోలీసుల ఎదుట ఆటో డ్రైవర్ చేసిన వ్యాఖ్యలు మరింత సంచలనంగా మారాయి. తాను తరలిస్తున్న బియ్యం "డాన్ బబ్లు, యూసఫ్ "కు చెందినదేనని చెప్పినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి అసలు సూత్రధారులను బయటకు తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు పదేపదే ఆరోపణలు వస్తున్నప్పటికీ రంగారెడ్డి జిల్లా సివిల్ సప్లై అధికారులు మాత్రం దాడులు నిర్వహించకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. బొంగులూరు గేటు (మంగళపల్లి), పెద్ద అంబర్‌పేట ప్రాంతాల్లో బహిరంగంగానే రేషన్ బియ్యం కొనుగోలు, నిల్వ, తరలింపు జరుగుతోందని స్థానికులు చెబుతున్నా అధికారుల స్పందన లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ పరిస్థితుల నేపథ్యంలో అక్రమ రేషన్ బియ్యం సరఫరాదారులతో కొంతమంది అధికారులకు ముందస్తు ఆర్థిక ఒప్పందాలు ఉన్నాయా.? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. తరచూ సమాచారం అందుతున్నా దాడులు లేకపోవడం, అక్రమ రవాణా నిరాటంకంగా కొనసాగడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.గతంలో సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ దాడులతో అక్రమ దందాకు కొంతమేర అడ్డుకట్ట పడినప్పటికీ, ప్రస్తుతం మళ్లీ అదే మాఫియా రెచ్చిపోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ అధికారులు, మీర్‌పేట పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ రవాణా కేంద్రాలపై రేషన్ బియ్యం దాన్లుగా పేరు పొందుతున్న బబ్లు, యూసఫ్ గోదాములను గుర్తించి ప్రత్యేక నిఘ ఏర్పాటు చేసి వరుస దాడులు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వం పేదల కోసం కేటాయిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా మళ్లించి కోట్ల రూపాయలు ఆర్జిస్తున్న మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇందులో ప్రమేయం ఉన్న వారెవ్వరైనా చట్టం ముందు నిలబెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అయితే, డ్రైవర్ ఉమర్ ఇచ్చిన సమాచారం మేరకు నిర్వాహకులు బబ్లు, యూసఫ్ పై కేసులను నమోదు చేయాలని దానితో కొంతమేర కట్టడి అవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. కేసు నెంబర్ 949/2026 కేసు నమోదు చేసినట్లు మీర్ పేట పోలీసులు తెలిపారు.



## అక్రమ రేషన్ బియ్యం గోదాంపై
# మెరుపు దాడి

- ఆదిబట్లలో భారీగా పీడీఎస్ బియ్యం స్వాధీనం
- రెండు లారీల్లో లోడుతో పాటు గోదాంలో నిల్వలు
- మొత్తం సుమారు 919 బస్తాలు పట్టివేత



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు ఆదిబట్లలోని టాటా కన్సల్టెన్సీ ప్రాంతంలో ఉన్న ఓ గోదాంపై మెరుపు దాడులు నిర్వహించి భారీ ఎత్తున అక్రమంగా నిల్వ చేసిన ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో మొత్తం సుమారు 919 బస్తాల పీడీఎస్ బియ్యం లభ్యమవడం కలకలం రేపింది.అధికారుల వివరాల ప్రకారం, గోదాంలో తనిఖీలు నిర్వహించగా జీజే 01 బీవై 3403 నంబర్ గల లారీలో బహురంగుల ప్లాస్టిక్ సంచుల్లో నింపిన సుమారు 524 బస్తాల పీడీఎస్ బియ్యం పూర్తిగా లోడ్ చేసి సిద్ధంగా ఉంచినట్లు గుర్తించారు. అలాగే టీజీ 13 టీ 2573 నంబర్ గల అశోక్ లేలాండ్ వాహనంలో మరో 65 బస్తాలు లోడ్ చేసి ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా టీజీ 12 టీ 3148 నంబర్ గల మరో ఖాళీ అశోక్ లేలాండ్ వాహనం కూడా గోదాం వద్ద లభ్యమైంది.గోదాం లోపల అదనంగా సుమారు 330 బస్తాల పీడీఎస్ బియ్యం నిల్వ చేసి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో వెంటనే ఆదిబట్ల పోలీస్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించి, స్వాధీనం చేసుకున్న బియ్యం, వాహనాలను పోలీసుల ఆధీనంలో భద్రపరిచారు. గోదాం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు పికెట్‌ను కూడా ఏర్పాటు చేశారు.రేపు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి చెందిన డిప్యూటీ తహసీల్దార్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) సంఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించడంతో పాటు ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో అధికారిక ఫిర్యాదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ దాడిలో ఆదిబట్ల సబ్ ఇన్‌స్పెక్టర్ అజయ్ బాబు, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ నరసింహా రెడ్డితో పాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అక్రమ రేషన్ బియ్యం రవాణా, నిల్వలపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

## ఏసీబీ వలలో హెచ్‌ఎండీఏ
# చీఫ్ ఇంజనీర్ రవీందర్

- అక్రమాస్తుల ఆరోపణలపై ఏకకాలంలో సోదాలు
- రికార్డుల ప్రకారం రూ.9.24 కోట్ల విలువైన ఆస్తులు గుర్తింపు
- నగదు, బంగారం, ఫ్లాట్లు, భవనాలు స్వాధీనం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) చీఫ్ ఇంజనీర్ బి. రవీందర్‌పై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కేసు నమోదు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో మంగళవారం ఏకకాలంలో పలుచోట్ల సోదాలు నిర్వహించిన అధికారులు, రికార్డుల ప్రకారం సుమారు రూ.9.24 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించారు. ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం, అవినీతి నిరోధక చట్టం 1988 (2018 సవరణ)లోని సెక్షన్ 13(1)(బీ), 13(2) కింద రవీందర్‌పై కేసు నమోదైంది. ఆయన నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, బినామీలకు సంబంధించిన మరో తొమ్మిది ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు.ఈ సోదాల్లో భారీగా స్థిరాస్తులు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. వీటిలో కొండకల్, కిష్టాపూర్, పసమాముల గ్రామాల్లో రూ.38.89 లక్షల విలువైన ఐదు ఓపెన్ ప్లాట్లు, నార్సింగి, నానక్‌రాంగూడలో రూ.2.07 కోట్ల విలువైన నాలుగు ఫ్లాట్లు, కొండాపూర్ మసీద్ బండలో రూ.3 కోట్ల విలువైన జీ౦4 భవనం, మోకిలలో రూ.1.33 కోట్ల విలువైన సెమీ-ఫినిష్డ్ విల్లా ఉన్నాయి. ఈ ఆస్తుల మార్కెట్ విలువ పత్రాల్లో చూపిన దానికంటే చాలా రెట్లు అధికంగా ఉంటుందని ఏసీబీ అంచనా వేస్తోంది. వీటితో పాటు రూ.3.82 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.45.06 లక్షలు, రూ.36.7 లక్షల విలువైన 1.44 కిలోల బంగారు ఆభరణాలు, 12.5 కిలోల వెండి వస్తువులు, నాలుగు వాహనాలు, ఇతర గృహోపకరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రవీందర్‌ను అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, మరిన్ని ఆస్తుల వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు వెల్లడించారు.

# ఏసీబీ వలలో పెద్దపల్లి మున్సిపల్ ఏఈ

- రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ పట్టివేత



పెద్దపల్లి (ప్రశ్న న్యూస్) పెద్దపల్లి జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం జరిపిన దాడిలో ఓ అవినీతి అధికారి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా (ఏఈ) పనిచేస్తున్న కల్లేపల్లి సతీశ్ కుమార్, ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. పెద్దపల్లి పట్టణంలోని తెనుగువాడ, కునారం రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటికల అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు రావాల్సిన రూ.12.28 లక్షల తుది బిల్లును ప్రాసెస్ చేసి, మంజూరు కోసం పంపడానికి సతీశ్ కుమార్ ఈ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. బాధితుడి నుంచి అందిన ఫిర్యాదు మేరకు, కరీంనగర్ ఏసీబీ యూనిట్ అధికారులు పక్కా ప్రణాళికతో సతీశ్ కుమార్ నివాసంలో అతడు లంచం స్వీకరిస్తుండగా పట్టుకున్నారు.లంచం తీసుకుంటున్న సమయంలో పట్టుకున్న అనంతరం, ఏసీబీ అధికారులు సతీశ్ కుమార్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో లెక్కల్లో చూపని రూ.32,31,900 నగదు లభించడంతో అధికారులు సైతం విస్మయానికి గురయ్యారు. లంచం సొమ్ముతో పాటు ఈ నగదును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సతీశ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని, కరీంనగర్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపరుస్తామని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే, టోల్ ఫ్రీ నంబర్ 1064 ద్వారా తమకు సమాచారం ఇవ్వాలని ఏసీబీ ప్రజలను కోరింది. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేసింది.

# ట్రాఫిక్ జామ్ చక్రబంధంలో విశ్వనగరం

## అస్తవ్యస్తమైన యూటర్న్ వ్యవస్థ

- ట్రాఫిక్ జామ్ లపై నియంత్రణ కోల్పోయిన సర్కార్
- నరకకూపాలుగా మారిన యూటర్నులు
- ఏసి గదుల్లో చేసే చట్టాలు క్షేత్రస్థాయి అమలుకావడం లేదు.
- రోడ్లపై ఆటో డ్రైవర్ల ఇష్టారాజ్యం పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- పూట్ ఫాత్ ఆక్రమణలతో ట్రాఫిక్ జామ్ సమస్యలు.
- సిగ్నల్ ఫ్రీ వ్యవస్థతో మొదటికొచ్చిన ట్రాఫిక్ సమస్య.
- నల్గొండ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్ తో గంటలతరబడి వాహనాలు నిలిచిపోతున్న జాడే లేని ట్రాఫిక్ పోలీసులు.

**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** విశ్వనగరంగా దూసుకెళ్తున్న హైదరాబాద్ మహనగరంలో ట్రాఫిక్ సమస్య అస్తవ్యస్తంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ మహనగరంలోని ప్రధాన మార్గాలలో రద్దీ విపరీతంగా పెరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగర ట్రాఫిక్ పోలీసుల లోపభూయిష్టమైన ప్రణాళికలు సమర్ధవంతమైన పర్యవేక్షణ, నిఘా వ్యవస్థ పూర్తిస్థాయిలో విఫలమవడం వల్ల ప్రయాణ సమయం వృథా అవుతోంది తప్ప ఎలాంటి ప్రయోజనం లేదు. నిత్యం ట్రాఫిక్ జామ్‌తో రోడ్లపై గంటల కొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోతుండటంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.నగరంలో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ జామ్ తీవ్రమై దాని ప్రభావం చుట్టూ కిలోమీటర్ల మేర కనిపిస్తున్నది. ట్రాఫిక్ జామ్ లపై సంబంధిత పోలీసు అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి. ట్రాఫిక్ సమస్యపై దశలవారీగా దృష్టిసారించి చర్యలకు ఉపక్రమిస్తే వాహనదారులకు కొంతమేర ఊరట కలుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### ట్రాఫిక్ జామ్‌లు..

నగరంలో వాహనదారులను ట్రాఫిక్ జామ్ సమస్య వెంటాడుతున్నది. నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు విసిగిపోతున్నారు. సమస్య పరిష్కారానికి అధికార యంత్రాంగంలోని ఉన్నతాధికారులు మల్లగుల్లాలు పడుతున్న క్షేత్రస్థాయిలో పరిష్కార మార్గాలు అమలు కావడం లేదు. సమస్య తీవ్రతపై ప్రభుత్వ స్పందన లేక పోవడంతో సమస్య మరింత జటిలంగా మారింది. అసలు ట్రాఫిక్ జామ్‌లు ఎందుకు అవుతున్నాయనే అంశంపై అధ్యయనం చేసి పరిష్కార మార్గాలను అన్వేషించాలని రాష్ట్ర ముఖ్యమంత్రే పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినను అధికారుల్లో చలనం లేదు.

### రోడ్లపై ఆటోవాలాల ఇష్టారాజ్యం..

నగర్ ట్రాఫిక్ సమస్యకు రోడ్లపై అటో డ్రైవర్ల ఇష్టారాజ్య డ్రైవింగే ప్రధాన కారణం. కనీసం ఆటో కూడా నడపలేని ఇరుకుల్లో ఆటోలతో ఫీట్లు చేస్తు ట్రాఫిక్ నిబంధనలను తుంగలో తొక్కి రోడ్లపై ఇష్టానుసారంగా వ్యవహరిస్తు ట్రాఫిక్ సమస్యకు కారణమవుచున్నారు. రోజురోజుకు రోడ్లపై పుట్టగొడుగుల్లా



పుట్టుకొస్తున్న కొత్త ఆటోలపై ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ లోపమే దీనికి ప్రధాన కారణం. అసలు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ చేసే ఆటోల ఫిట్‌నెస్, డ్రైవర్ లైసెన్స్ వంటి వాటిపై పర్యవేక్షించాల్సిన ట్రాఫిక్ అధికారులు కేవలం ఫోటో గ్రాఫర్ల అవతారంలో కాలం వెళ్లదీయడం ప్రభుత్వ వైఫల్యమని చెప్పక తప్పదు.

### పూత్ ఫాత్ ఆక్రమణలు..

ట్రాఫిక్ జామ్ సమస్యలు పెరగడానికి మరొక ముఖ్య కారణం ఫుట్‌పాత్ ఆక్రమణలు. పూట్ పాత్ లపై వెళ్ళాల్సిన పాదాచారులు పూట్ ఫాత్ ఆక్రమణలతో రోడ్లపై రాకపోకలు సాగించడంతో సమస్య తీవ్రత పెరిగింది. జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంగా పని చేసి ఫుట్ ఫాత్ ఆక్రమణలను తొలగించడం వల్ల సమస్య కొంతమేరకు తీరుతుందని, ఆ మేరకు చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రజలు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### ఏసీ గదుల్లో చేసే చట్టాలు క్షేత్రస్థాయిలో అమలు చేయాలి..

నగరంలో ప్రజలపై తీవ్రమైన ఒత్తిడి పెంచుతున్న ట్రాఫిక్ సమస్యపై ముఖ్యమంత్రి స్థాయి నుండి పోలీసు ఉన్నతాధికారుల వరకు చేసే సమీక్షలు పటిష్టవంతంగా క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడమే కాకుండా ట్రాఫిక్ వ్యవస్థ మరింత జటిలమై అస్తవ్యస్తంగా మారింది.

### నరకకూపంగా మారిన యూటర్న్ వ్యవస్థ..

హైదరాబాద్ మహనగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి సిగ్నల్-ఫ్రీ ప్రయాణాన్ని అందించాలని ప్రవేశపెట్టిన యూటర్న్ వ్యవస్థతో సమస్య మరింత తీవ్రమైంది. మితిమీరిన వేగంతో ప్రయాణించే అటోలు, టూ వీలర్స్ యూటర్నుల అత్యంత ప్రమాదకరమైన స్థితిలో ట్రాఫిక్ నిబంధనలను తుంగలో తొక్కి తమ వాహనాలతో ఫీట్లు చేస్తు తోటి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా యూటర్న్‌ల వద్దనే జరగడం గమనార్హం. రోడ్డు పైకి వచ్చే వాహనాల కదలికలపై నిఘా పెట్టాల్సిన ట్రాఫిక్ పోలీసు సిబ్బంది తమ విధులను గాలికి వదిలి నింపాదిగా సెల్ ఫోన్లతో కాలక్షేపం చేస్తున్నారు. ఇక ప్రజల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన యూటర్న్ వ్యవస్థ ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారింది. సమయం వృథా కాకూడదనే ఉద్దేశంతో తెచ్చిన యూటర్న్ వ్యవస్థతో పరిణమించే అనర్థాలపై ప్రభుత్వం దృష్టిసారించాలని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తొలగించి, వాహనదారులకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్దిష్ట దూరంలో యూటర్న్‌లను ఏర్పాటు చేశారు. కాని వాటి వద్ద భద్రతను విస్మరించడం దురదృష్టకరం. ప్రస్తుతం నగరంలో యూటర్నులే ప్రమాదాలకు, ట్రాఫిక్ జామ్ లకు కారణమవుతున్నయి. ముఖ్యంగా పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నుండి ప్రతినిత్యం వేల సంఖ్యలో నగరానికి వచ్చే వాహనాలన్ని నల్గొండ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అత్యంత రద్దీగా ఉండే నల్గొండ చౌరస్తా నుండి చాదర్ ఘాట్ బ్రిడ్జి వరకు ట్రాఫిక్ సిబ్బంది జాడే ఉండదు. ఈ రహదారిలో ప్రయాణించడమంటేనే వాహనదారుల్లో వణుకు పుడుతుంది. కేవలం ఐదు నిమిషాల ప్రయాణానికి గంటలకొద్ది సమయం పడుతుందని పలువురు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి యూటర్న్ ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేస్తు, రోడ్డుపై ప్రయాణించే ప్రతి వాహనం కదలికలపై నిఘను పెంచి ప్రజలకు మెరుగైన, సౌకర్యవంతమైన సేవలను అందించాలని వాహనదారులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588